

ఏసీబీ వలలో వీఆర్వో!

• రైతు వద్ద రూ.20వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయాడు!

ఏఎస్‌పేట, జనవరి 19 : పొలం విషయమై పేరు మార్పు కోసం ఓ రైతు వద్ద లంచం తీసుకుంటూ ఓ వీఆర్వో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు. మండల కేంద్రమైన ఏఎస్‌పేట తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ దాడుల ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. పెద్దహబీపురం గ్రామనికి చెందిన పొలిశెట్టి రామ్మూర్తి, సుబ్బమ్మలకు ఉన్న నాలుగెకరాల పొలాన్ని తమ ఇద్దరు కుమారులు చంద్రభూ షణ్, కోటేశ్వర రావులకు చెరో రెండెకరాల చొప్పున రాసి ఇచ్చారు. కానీ కోటేశ్వరరావుకు చెందిన రెండెకరాలను చంద్రభూషణ్ కొనుగోలు చేశారు. అయితే, కోటేశ్వరరావు వీఆర్వో హజరతయ్య సహకారంతో భూమి మొత్తం తన పేరిట అడంగళ్ ఎక్కించుకున్నారు. ఈ విషయం తెలిసి చంద్రభూషణ్ పొలం తాను కొనుగోలు చేశానంటూ పత్రాలు చూపాడు. దీంతో ఎకరాకు రూ.15 వేలు చొప్పున నాలుగెకరాలకు రూ.60 వేలు ఇస్తే పేరు మీదకు మారుస్తానని డిమాండ్ చేశారు. చివరికి 40 వేలకు ఒప్పందం కుదిరింది. ముందుగా రూ.20వేలు ఇవ్వాలని సూచించారు. అయితే, అంత నగదు ఇచ్చుకోలేని చంద్రభూషణ్ ఏసీబీ డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్‌ను ఆశ్రయించాడు. ఆయన సూచనల మేరకు శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దారు కార్యాలయంలో చంద్రభూషణ్ వీఆర్వోకు రూ.20వేలు నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని, వీఆర్వో హజరత్తయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ మోహన్ తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు ఆంజనేయరెడ్డి, విజయకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఏసీబీకి పట్టుబడ్డ వీఆర్వో హజరత్తయ్య, స్వాధీనం చేసుకున్న నగదు

22 నుంచి విధులకు న్యాయవాదులు

• నెల్లూరు బార్ అసోసియేషన్

నెల్లూరు (లీగల్) : ఈ నెల 22వ తేదీ నుంచి న్యాయవాదులు కోర్టు విధులకు హాజరు కావాలని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమా మహేశ్వర్ రెడ్డి, మద్దిబోయిన సుందరయ్య యాదవ్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ -2023కి వ్యతిరేకంగా న్యాయవాదులు డిసెంబరు 7వ తేదీ నుంచి కోర్టు విధులను బహిష్కరించి ఆందోళన చేస్తున్నారన్నారు. అయితే కక్షిదారుల అవసరాల దృష్ట్యా న్యాయవాదులు విధులకు హాజరవుతూ సదరు చట్టంపై ప్రజలకు వివిధ రూపాలలో అవగాహన కల్పించాలని ప్రత్యేక కమిటీ చేసిన సూచన మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

ఇవిగో మా సమాధానం!

• నోటీసులపై అంగన్‌వాడీలు

వరికుంటపాడు, జనవరి 19 : 'డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మాకు నోటీసులు ఇవ్వడం దారుణం. ఇవిగో మా సమాధానం.' అంటూ అంగన్వాడీలు అంబేడ్కర్ సహా ఉన్నతాధికారులకు సమాధాన పత్రాలు పంపారు. 39వ రోజు శుక్రవారం కూడా జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన చేశారు. వరికుంటపాడు తహసీల్దారు కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి సమాధాన పత్రాలు అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు షేక్ రజియా మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెను ఎట్టి పరిస్థితుల్లోనూ విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సంజాయిషీ నోటీసులను ఉపసంహరించుకొని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



అంబేడ్కర్ చిత్రపటానికి సమాధాన పత్రాలు ఇస్తున్న అంగన్వాడీలు


వెంకటగిరిలో జనసునామీ

- టీడీపీ బహిరంగసభకు పోటెత్తిన ప్రజానీకం
- చంద్రబాబుపై శ్రేణుల్లో ఇనుమడించిన అభిమానం
- సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయిన పార్టీ జిల్లా నేతలు

వెంకటగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో శుక్రవారం చంద్రబాబు పాల్గొన్న 'రా కదలిరా' బహిరంగసభకు జనం పోటెత్తారు. అధినేత పట్ల శ్రేణుల్లోనూ, ప్రజల్లోనూ అభిమానం, ఆదరణ మరింతగా ఇనుమడించిన వైనం సభలో కళ్ళకు కట్టింది. వెంకటగిరి సెగ్మెంట్ నుంచీ భారీఎత్తున శ్రేణులు తరలి రాగా శ్రీకాళహస్తి, గూడూరు నియోజకవర్గాల నుంచీ కూడా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు సభకు హాజరయ్యారు. ఇక తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని మిగిలిన సెగ్మెంట్ల నుంచీ కూడా ఇంచార్జులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ శ్రేణుల్ని సమీకరించడంతో వెంకటగిరి హెలిపాడ్ వద్ద, పట్టణ ప్రధాన రహదారులతో పాటు బహిరంగసభాస్థలి, పరిసర ప్రాంతాలు కూడా జనంతో నిండిపోయాయి. చంద్రబాబు మధ్యాహ్నం 11.47 గంటలకు హెలికాప్టర్‌లో వెంకటగిరి చేరుకున్నారు. అక్కడ నుంచీ 12.20 గంటలకు సభావేదికపైకి చేరుకున్నారు. 12.52 గంటలకు ప్రసంగం ప్రారంభించిన ఆయన 1.42 దాకా మాట్లాడారు. ఎండ చురుగ్గా వుండడంతో పాటు ఆకలి వేస్తున్నా పార్టీ శ్రేణులు గానీ, ప్రజలు గానీ బహిరంగసభా ప్రాంగణం నుంచీ కదలలేదు. చంద్రబాబు వేదికపైకి వచ్చినపుడు జనం నుంచీ వచ్చిన స్పందన చూశాక ఆయన పట్ల శ్రేణుల్లో అభిమానం మరింత పెరిగినట్టు అనిపించింది. పలు అంశాలపై నేరుగా శ్రేణులనే ప్రశ్నించినపుడు కూడా కార్యకర్తలతో పాటు జనం ఉత్సాహంగా స్పందించి సమాధానాలిచ్చారు. చంద్రబాబు సభాస్థలి నుంచీ వెనుదిరిగాకే జనం వెలుపలికి వచ్చారు. వెంకటగిరి పట్టణ చరిత్రలో ఓ రాజకీయ సభకు ఈ స్థాయిలో జనం హాజరు కావడం విశేషమని స్థానికులు మాట్లాడుకోవడం వినిపించింది. అంచనాలకు మించి జనం హాజరు కావడంతో తిరుపతి జిల్లా టీడీపీ నేతలు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.



జిల్లా మారినా జనం రాత మారిందా?



వెంకటగిరిలో బ్రహ్మాండమైన బహిరంగసభలో వేలాదిగా హాజరైన పార్టీ శ్రేణులను, ప్రజలనుద్దేశించి మాట్లాడిన చంద్రబాబు జిల్లా ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ, ప్రజలకు ప్రశ్నలు సంధిస్తూ, వారి నుంచి సమాధానాలు రాబడుతూ ఉత్సాహంగా, ఉద్వేగంగా ప్రసంగించారు. ఆయన ప్రసంగంలోని కొన్ని ముఖ్యాంశాలు ఇవీ...

అప్పుడు.. ఇవి చేశాను

"గతంలో నేను నెల్లూరు, తిరుపతి, చెన్నైలను అనుసంధానించి ఉమ్మడి నెల్లూరు జిల్లాను పారిశ్రామిక హబ్‌గా చేయాలనుకున్నాను. నెల్లూరు జిల్లా దగదర్తిలో విమానాశ్రయం, కృష్ణపట్నం పోర్టు ఏర్పాటు చేయడం ద్వారా జిల్లాను పారిశ్రామికంగా ఉన్నత స్థాయికి చేర్చాలని ప్రయత్నించాను. తిరుపతిలో ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేశాను. దానివల్ల అక్కడ టీసీఎల్, జోహో, సెల్‌కాన్, కార్బన్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కంపెనీలు అనేకం వచ్చాయి. తిరుపతి సహా తూర్పు ప్రాంతాన్ని ఆటోమొబైల్ హబ్ చేయడానికి చర్యలు తీసుకున్నా. ఫలితంగా అపోలో టైర్స్ వంటి ఆటోమొబైల్ సంబంధ పరిశ్రమలు చాలా ఏర్పాటయ్యాయి. ఏర్పేడు, వెంకటగిరి మధ్య ఐఐటీ, ఐసర్ వంటి అత్యున్నత జాతీయ విద్యా సంస్థలు ఏర్పాటు జరిగింది."

ఇప్పుడు ఇలా దోచేశారు

"ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టిన అనేక పనులు జగన్ ప్రభుత్వంలో ఆగిపోయాయి. ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి రూ. 399 కోట్లతో నేను పనులు మంజూరు చేస్తే కేవలం రూ. 19 కోట్లు ఖర్చు చేశాక పనులు ఆపేశారు. కండలేరు ప్రాజెక్టు పనులు ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో దానిపై ఆధారపడిన తెలుగుగంగ ప్రాజెక్టు కూడా పూర్తి కాకుండా ఆగిపోయింది. గూడూరులో రూ. 4500 కోట్ల విలువైన సిలికా ఇసుకను ఇష్టానుసారంగా అమ్మేస్తున్నారు. ప్రభుత్వం నుంచీ లైసెన్సు పొందిన అసలైన లీజు హోల్డర్లను తరిమేశారు. క్వార్ట్జ్, బెరైటీస్, లేటరైట్, లైమ్ స్టోన్ వంటి మైన్లన్నీ అక్రమ మైనింగ్‌తో కొల్లగొట్టేశారు."

వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైంది. రానున్న ఎన్నికల్లో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాలూ గెలుస్తున్నాం.





వైసీపీ నేతలపై బాబు పంచ్‌లు

ఈ ప్రాంత అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల కోసం గళం విప్పిన ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని సీఎం జగన్ దూరంగా పెట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో అధికార పార్టీ ఎమ్మెల్యేల దోపిడీపై ధ్వజమెత్తారు.

- సర్వేపల్లిలో మంత్రి కాకాణి కోర్టు దొంగ. గ్రావెల్ దోపిడీకి పాల్పడిన కాకాణికి ఇపుడు నెల్లూరు జిల్లాను కొనే శక్తి వచ్చేసింది.
- సత్యవేడు ఎమ్మెల్యే ఒట్టి రబ్బర్ స్టాంపు. అతడి నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి పెత్తనం సాగుతోంది.
- పెద్దిరెడ్డి మామూలు పుడింగి కాదు. రాష్ట్రంలోని మైన్లన్నింటినీ మింగేసి అరిగించుకోగల శక్తి ఆయనకు ఉంది.
- గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ మైన్లను ప్రసాదం తరహాలో మింగేశాడు. మామూళ్ళ వసూలు కోసం కొడుకును పెట్టాడు. ఆ రూ.4500 కోట్ల సిలికా దోపిడీలో ఎమ్మెల్యే వాటా ఎంతో చెప్పాలి.
- వెంకటగిరికి కొత్త బిచ్చగాడు వచ్చాడు. ఆయన పెన్నా నదిలో ఇసుక దోపిడీకి పాల్పడుతున్నాడు. 150 ఎకరాల్లో సిలికా దోపిడీ చేశాడు. నియోజకవర్గంలో విపరీతంగా భూ కబ్జాలకు పాల్పడుతున్నాడు. పార్టీ ఇంఛార్జిగానే ఇలా బరితెగించే ఆయన ఒకవేళ ఎమ్మెల్యే అయితే ఇంకేం చేస్తాడో ఊహించుకోండి.
- సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇసుక, లిక్కర్, గంజాయి, క్రికెట్ బెట్టింగులు వంటి అక్రమ దందాలకు పాల్పడుతున్నారడు. సీఎం జగన్ విశాఖలో రిషికొండను బోడి చేసిన స్ఫూర్తితో శిరసనంబేడు కొండకు ఈయన గుండు కొట్టాడు.
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు రెడ్డి అవినీతి చూస్తుంటే కళ్లు తిరుగుతున్నాయి. అక్కడ రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగింది. రేణిగుంటను కూతురికి, ఏర్పేడును తమ్ముడికి రాసిచ్చేసి, శ్రీకాళహస్తిని తన సొంతానికి పెట్టుకున్నాడు.
- తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నాస్తికుడు. ఇపుడు దేవుడికే నామాలు పెడుతున్నాడు.

పైరవీల ధర్మారెడ్డి

తిరుమల ఈవో ధర్మారెడ్డిపై కూడా చంద్రబాబు పరోక్ష విమర్శలు చేశారు. శ్రీవారిని అడ్డం పెట్టుకుని పైరవీలతో కేసులు లేకుండా చేసే బాధ్యతను జగన్ ఆ అధికారికి అప్పగించారని ఆరోపించారు. సర్వీసులో ఒక్కసారైనా టీటీడీ ఈవో కావాలని కలలు కనే సీనియర్ ఐఏఎస్‌లకు కూడా ఇవ్వకుండా జగన్ తన కేసుల కోసమే ఆ అధికారిని ఈవోగా నియమించారన్నారు.

గూడూరు, వెంకటగిరికి వరాలు

అధికారంలోకి వచ్చాక గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తా. ప్రతి చేనేత కుటుంబానికీ ఇపుడు వైసీపీ ప్రభుత్వం ఇస్తున్న దానికంటే ఎక్కువ సాయం అందిస్తా. ఆక్వా రైతులకు యూనిట్ ఒకటిన్నర రూపాయి చొప్పున సబ్సిడీ విద్యుత్ అందిస్తా. డక్కిలి మండలంలో ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణాన్ని, అలాగే కండలేరు రిజర్వాయరు పెండింగ్ పనులను, తెలుగు గంగ ప్రాజెక్టు పెండింగు పనులను పూర్తి చేస్తాం. వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీకి అనుబంధంగా స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ ఏర్పాటు చేస్తా. స్వర్ణముఖి నదిపై చెక్‌డ్యాములు, వెంకటగిరి-నాయుడుపేట మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తా.

సభలో ప్రముఖులు : చంద్రబాబు సభలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, రాష్ట్ర మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, బీసీ నాయకుడు మస్తాన్ యాదవ్,వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, సునీల్ కుమార్, నెలవల సుబ్రమణ్యం, సుగుణమ్మ, కంభం విజయరామిరెడ్డి, టీడీపీ ఇంచార్జులు గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, జనసేన నెల్లూరు, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు మధుక్రాంత రెడ్డి, పసుపులేటి హరిప్రసాద్, వెంకటగిరి జనసేన నాయకులు తోట కృష్ణయ్య, గూడూరు వెంకటేశ్వర్లు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, పూకా విజయకుమార్, వెంపటి మాధవుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నకిలీల మాటేమిటి!?

- ఓట్ల తొలగింపునకు అధికార పార్టీ నేతల కుట్ర
- బతికి ఉన్నా లేనట్టుగా ఫారం-7 దరఖాస్తులు
- ఏఎస్‌పేట, చేజర్లలో వైసీపీ బీఎల్‌ఏలపై కేసుల నమోదు
- తిరస్కరణ దరఖాస్తులు ఎవరు ఇచ్చినట్లు?
- కఠినంగా వ్యవహరించడంలో యంత్రాంగం విఫలం

ఓట్ల తొలగింపు, దొంగ ఓట్ల చేరిక రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణం లో కేంద్ర ఎన్నికల సంఘం రంగంలోకి దిగింది. ఇప్పటివరకు అనేక ఆరోపణలు వచ్చినా, ఆధారాలు బయటపడినా అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. గతేడాది ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో దొంగ ఓట్ల కలకలం రేపినా స్పందించలేదు. కానీ ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం సదరు అధికారులపైనే చర్యలకు ఉపక్రమించడంతో పరిస్థితి వేడెక్కింది. జిల్లాలోనూ ప్రతిపక్ష పార్టీల సానుభూతి పరుల ఓట్లను తొలగించేందుకు భారీ కుట్రలే జరిగినట్లు జరుగుతున్న పరిణామాలనుబట్టి అర్థమవుతోంది. చేజర్ల, ఏఎస్‌పేట మండలాల్లో నమోదైన కేసులే ఇందుకు నిదర్శనం. అయితే అధికార పార్టీ నేతలకు భయపడి చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్న అధికారులు, ఎన్నికల సంఘం దెబ్బకు తూతూమంత్రంగా ఈ రెండు చోట్ల కేసులు పెట్టారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి రెండు లక్షలకుపైగా ఫారం-7 దరఖాస్తులు అందాయి. వాటిని పరిశీలించి 1.68 లక్షల ఓట్లను తొలగించారు. అదే సమయం లో 32 వేలకుపైగా దరఖాస్తులను తిరస్కరించారు. అంటే వీరంతా బతికి ఉండటమో లేదా గ్రామంలోనే నివాసం ఉండడమో జరిగింది. అటువంటప్పుడు ఇన్ని వేల దరఖాస్తులను చేసిందెవరన్న ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. ఇలా దరఖాస్తు చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. అదే సమయంలో ఆమోదించిన ఫారం-7 దరఖాస్తులపైనా ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. 2022, జనవరి నుంచి 2023, ఏప్రిల్ 14 వరకు భారీగా ఓట్లను జిల్లాలో తొలగించారు. ఆ తర్వాతి నుంచి ఇప్పటి వరకు కూడా అదే రీతిలో ఓట్లను తొలగించడంతో అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఇంటింటి సర్వేలో భారీగా ఫారం-7 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిష్కరించకుండానే ఎస్ఎస్ఆర్- 2023ను ప్రారంభించారు. దీంతో నాడు వచ్చిన దరఖాస్తులను సరిచూసుకునే అవకాశం ప్రతిపక్షాలకు లేకుండా పోయిం ది. ఈ నెల 5వ తేదీన తుది ఓటర్ల ముసా యిదాను ప్రచురించి ఉంటే ఈ పాటికి దానిని పరిశీలించుకునే సమయం ప్రతిప క్షాలకు లభించి ఉండేది. కానీ ముసాయి దాను ఈ నెల 22న ప్రచురించనున్నారు. ఆ తర్వాత గ్రామాలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ఎన్ని చిత్ర విచిత్రాలు బయటపడ తాయో తెలుస్తుంది. - నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

- చేజర్ల మండలం ఉలవపల్లిలో 75 ఓట్లు తొలగించాలని షేక్ కాలేషా అనే ప్రభుత్వ అధ్యాపకుడి ఐడీతో ఎన్నికల సంఘానికి గతేడాది డిసెంబరు 26వ తేదీన ఫారం-7 దరఖాస్తులు అందాయి. దీనిపై ఆత్మకూరు ఆర్డీవో ఆ గ్రామంలో విచారించగా ఆ దరఖాస్తులన్నీ నకిలీవని నిర్ధారించారు. ఉద్దేశపూర్వకంగా ఓట్ల తొలగింపునకు దరఖాస్తు చేశారని షేక్ కాలేషాను విచారించారు. అయితే వైసీపీ బూత్ లెవల్ ఏజెంట్ పట్టెం శ్రీనివాసులు తన పేరు మీద ఫారం-7 దరఖాస్తులు చేశారని కాలేషా తెలియజేశారు. దీంతో అతడిపై తహసీల్దార్ కృష్ణ ఈ నెల 8వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.
- అనుసముద్రంపేట మండలం శ్రీకొలను గ్రామంలో వైసీపీకి చెందిన బూత్ లెవల్ ఏజెంట్ కాకి ప్రసాద్‌రెడ్డి 101 ఫారం-7 దరఖాస్తులను ఈ నెల 8వ తేదీన ఎన్నికల సంఘం పోర్టల్‌లో అందజేశారు. 35 మంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారని, మరో 66 మంది చనిపోయారని ఆ దరఖాస్తుల్లో పేర్కొన్నారు. దీనిపై అదే రోజు తహసీల్దార్ విచారణ జరపగా ఆ దరఖాస్తులు ఫేక్ అని, ఉద్దేశపూర్వకంగా పెట్టారని నిర్ధారించారు. దీంతో ఈ నెల 8వ తేదీన ప్రసాద్‌రెడ్డిపై తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఫారం-7 దరఖాస్తుల వివరాలు.. వచ్చిన దరఖాస్తులు : 2,01,732 తొలగించిన ఓట్లు : 1,68,859 తొలగించని ఓట్లు : 32,197 పెండింగ్‌లో ఉన్నవి : 676

జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీ

నెల్లూరు (క్రైం), జనవరి 19 : జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
కె ప్రతాప్‌రెడ్డి	గుడ్లూరు	ఏఎస్‌పేట
పి నరేష్	ఏఎస్‌పేట	కందుకూరు రూరల్
కె తిరుపతయ్య	కందుకూరు రూరల్	వరికుంటపాడు
కె సుమన్	వరికుంటపాడు	వీఆర్ నెల్లూరు
బి లక్ష్మణరావు	నెల్లూరు రూరల్	గుడ్లూరు
కె కిషోర్‌బాబు	వీఆర్ నెల్లూరు	కండలేరు
ఎమ్ సూర్యప్రకాష్‌రెడ్డి	వీఆర్ నెల్లూరు	అనంతసాగరం
పి విజయ శ్రీనివాస్	వీఆర్ నెల్లూరు	బాలాజీనగర్ (నెల్లూరు)
ఎ శ్రీనివాసులరెడ్డి	వీఆర్ నెల్లూరు	ముత్తుకూరు
ఎ శివకృష్ణారెడ్డి	ముత్తుకూరు	డిఎస్‌బి
ఎస్ సుమన్	కావలి రూరల్	నవాబుపేట (నెల్లూరు)
కె మరిడినాయుడు	వీఆర్ నెల్లూరు	దగదర్తి
డిఎస్ విజయకుమార్	దగదర్తి	వీఆర్ నెల్లూరు

బట్టలు విప్పి.. కేకలు వేసి!

- కావలిలో కొందరు యువకుల వికృత చేష్టలు
- వైరల్‌గా మారిన నగ్న ప్రదర్శన వీడియోలు
- వీరికి ఓ ప్రజాప్రతినిధి అనుచరుల అండ
- విసిగి వేసారిపోతున్న పట్టణవాసులు
- అంతా తెలిసినా నిద్రావస్థలో పోలీసులు


బైక్ లైట్లు వేసి ఈలలు వేస్తున్న యువకులు

కావలిలో అధికార పార్టీ నేతల ముఖ్య అనుచరుల చేష్టలు శ్రుతిమించుతున్నాయి. తమకు ఎవరూ అడ్డులేరంటూ అమాయకులపై భౌతిక దాడులు చేయడమే కాదు.. రాత్రిపూట వికృత చేష్టలకూ దిగుతున్నారు. కొంతమంది యువకులు అర్ధరాత్రి వీధుల్లో తిరుగుతూ కత్తులతో దాడులు చేస్తూ హల్‌చల్ చేస్తుంటే, మరికొందరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఒంటిపై బట్టలు విప్పి ఈలలు వేస్తూ పట్టణ వాసులను భయాందోళనకు గురి చేస్తున్నారు. ఇదంతా పోలీసులకు తెలిసినా ఓ ప్రజాప్రతినిధి నుంచి వస్తున్న ఒత్తిళ్లతో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కావలి రూరల్, జనవరి 19 : పట్టణ నడిబొడ్డున కామాటివారి వీధిలో అధికార పార్టీకి చెందిన ఓ నేత అనుచరుడు ఓఇంటి మిద్దెపై గదిని అద్దెకు తీసుకుని స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. అయితే, నిత్యం మద్యం సేవించి అర్ధరాత్రిపూట రోడ్లపై చేరి పెద్దగా కేకలు, ఈలలు వేస్తుండటంతో స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరు 31, జనవరి 1, జనవరి 15 సంక్రాంతి పండుగనాడు వీధుల్లో వీరి చేష్టలకు అడ్డూ అదుపు లేకపోవటంతో విసిగిపోయిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు వచ్చి రోడ్డుపై తిరుగుతున్న యువకులను మందలించి వెళ్లిపోయారు. ఈ దృశ్యాలన్నీ ఆ వీధిలోని ఓ ఇంటి సీసీ ఫుటేజీలో ఉన్నాయని తెలుసుకున్న యువకులు 17వ తేదీన అర్ధరాత్రి సమయంలో ఒంటిపై ఒట్టలు విప్పి సీసీ ఫుటేజీ వైపు చూపుతూ బిగ్గరగా కేకలు వేశారు. అంతేగాక మరి కొందరు బైక్‌పై హల్‌చల్ చేశారు. ఈ వ్యవహారమంతా పోలీసులకు తెలిసినా పట్టించుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వరుస ఘటనలతో బెంబేలు

కావలిలోని ఓ ప్రజాప్రతినిధి అనుచరులు చేస్తున్న వరుస ఘటనలతో పట్టణవాసులు బెంబేలెత్తిపోతున్నారు. డిసెంబరు 25వ తేదీన ప్రజాప్రతినిధి అనుచరుడు, మరికొందరు యువకులు రెండు కార్లలో తుమ్మలపెంట జడ్పీ స్కూల్ మైదాం వద్ద ముగ్గురు యువకులపై కత్తులు, రాడ్లతో దాడి చేసి వెళ్లారు. అలాగే జనవరి 16వ తేదీన పాతూరులో ఇద్దరిపై కత్తులతో దాడి జరిగింది. ఇలా వరుసగా దాడులు జరుగుతున్నా వీటిని నిరోధించాల్సిన ప్రజాప్రతినిధి తనకేమీ తెలియదన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కావలిలో జరుగుతున్న వరుస ఘటనలపై స్పందించి కఠినంగా వ్యవహించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

తిరుగు ప్రయాణం మరింత ప్రియం

- ప్రభుత్వ సేవలో ఆర్టీసీ బస్సులు
- టికెట్టు ధరలు రెండింతలు చేసిన ప్రైవేటు ట్రావెల్స్
- దోపిడీకి గురవుతున్న ప్రయాణికులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 19: సంక్రాంతి పండుగ వస్తే నగరాలు, పట్టణాల ప్రజలు స్వస్థలాలైన పల్లెలకు తరలివస్తారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం సంక్రాంతి పండుగకు సొంతూర్లకు వేలాది మంది వచ్చారు. పండుగకు ముందు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు టికెట్ ధరలను సాధారణం కన్నా ఎక్కువ వసూలు చేయగా సంక్రాంతి అనంతరం తిరిగి వెళ్లే వారికి ప్రయాణం మరింత ఖరీదుగా మార్చాయి. ఆర్టీసీ బస్సులు సీఎం సభకు అధిక సంఖ్యలో తరలి వెళ్లడంతో ప్రైవేటు ట్రావెల్స్ ఇష్టారాజ్యంగా టికెట్ ధరలు పెంచేశాయి. సాధారణ రోజులతో పోలిస్తే టికెట్ ధరలు రెండింతలు పెంచి, వాటిని నేరుగా ఆన్‌లైన్‌లో ఉంచి ప్రజలను దర్జాగా దోచుకుంటున్నారు. ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు నగరాల నుంచి నెల్లూరుకు పండుగకు ముందు, పండుగ తర్వాత నడిచే ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో ఇష్టానుసారంగా ధరలు పెంచారు. ప్రజలు తప్పనిసరిగా ప్రయాణాలు చేయాల్సి వస్తుండటంతో చేసేది లేక అధిక నగదు చెల్లించి టికెట్లు బుక్ చేసుకుని ప్రయాణాలు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో పెంచిన ధరలు

ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో, యాప్‌లలో నేరుగా పెంచిన టికెట్ల ధరలను ఉంచి సీట్లు బుక్ చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి టికెట్ల ధరలు పెంచుకుంటూ పోతున్నారు. ఇంతలా టికెట్ల ధరలు పెంచుతూ పోతున్నా అటు ప్రభుత్వం ఇటు రవాణా శాఖ దృష్టిసారించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్టీసీ స్పెషల్‌లోనూ సాధారణ చార్జీలు

ఆర్టీసీ నెల్లూరు రీజియన్ నుంచి పండుగల సందర్భంగా హైదరాబాద్, బెంగళూరు, కర్నూలు, వైజాగ్, చెన్నై నగరాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. ఆ స్పెషల్ బస్సుల్లోనూ సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నారు. ప్రత్యేక బస్సుల వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ప్రయాణికులు నేరుగా ఆన్‌లైన్ లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అయితే విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ విష్కరణ నేపథ్యంలో రెండు రోజులుగా రీజియన్ నుంచి వందల సంఖ్యలో బస్సులను ప్రభుత్వసేవ కోసం విజయవాడకు తరలించారు. దీంతో బస్సుల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ అయిన బస్సులను మాత్రమే దూర ప్రాంతాలకు నడుపుతోంది. ప్రయాణికుల రద్దీ ఉన్నప్పటికీ అదనపు బస్సులు నడపలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు ప్రైవేటు బస్సుల వైపు అడుగులు వేస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు ట్రావెల్స్ వారు గంట గంటకు ధరలకు పెంచుతూ ప్రజలను దోచుకుంటున్నారు.

ప్రైవేటు బస్సుల్లో టికెట్ ధరల వ్యత్యాసం ఇలా...

ప్రాంతం	పాత ధర	పెంచినది
హైదరాబాద్ (నాన్ ఏసీ)	రూ.800	రూ.1500-2000
హైదరాబాద్ (ఏసీ)	రూ.1300	రూ.2000-2500
బెంగళూరు (నాన్ ఏసీ)	రూ.800	రూ.1500-2000
బెంగళూరు (ఏసీ)	రూ.1300	రూ.2000-2800


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మస్తాన్ యాదవ్

చంద్రబాబును కలిసిన మస్తాన్

తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శుక్రవారం డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్ కలిశారు. వెంకటగిరిలో జరిగిన బహిరంగసభలో పాల్గొనేందుకు వచ్చిన చంద్రబాబును మస్తాన్ యాదవ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బైక్ బోల్తాపడి ఇద్దరికి గాయాలు

వెంకటాచలం : బైక్ బోల్తాపడి ఇద్దరికి గాయాలైన సంఘటన కసుమూరు సమీపంలో పొలిచెర్లపాడు మలుపు వద్ద శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు నగరంలోని కిసాన్ నగర్‌కు చెందిన సుహెల్, కరీముల్లా మోటార్‌బైక్‌పై కసుమూరు దర్గాకు వచ్చి తిరిగి నెల్లూరు వెళ్తుండగా పొలి చెర్లపాడు మలుపు వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. దీం తో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని కసు మూరులోని ఒక ప్రైవేటు క్లినిక్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు.

ఎన్‌సీసీ అధికారిగా గణేష్ బాలాజీ


నూతన అధికారికి స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

నెల్లూరు (విద్య), జనవరి 19 : నెల్లూరులోని 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్‌గా గణేష్ జీ బాలాజీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన లెఫ్టినెంట్ కమాండర్ వినయ్ రామచంద్రన్ వీడ్కోలు కార్య క్రమం నగరంలోని కొండాయపాళెం స్నేహనగర్ కార్యాలయంలో జరిగింది. రెండేళ్లకు పైగా జిల్లాలో సేవలందించిన వినయ్ కర్ణాటకలోని మైసూర్ నేవల్ యూనిట్ ఎన్‌సీసీ విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మహారాష్ట్రలోని ముంబై ఇండియన్ నేవల్ షిప్ విపుల నుంచి వచ్చిన గణేష్ జీ బాలాజీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమం లో కల్నల్ కమాండింగ్ ఆఫీసర్ సునీల్‌కుమార్, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్లు గుండాల నరేంద్రబాబు, సీవీ నాగరాజు, విద్యాసాగర్, మస్తానయ్య, కేర్‌టేకర్ ఆఫీసర్లు దివ్య, నాగరాజు, కొండారెడ్డి, రమణ, న్యామతుల్లా, అరోరా, సురేష్, సాయి, శంకరి, కార్యాలయ సూపరింటెండెంట్ ముకుంద సాగర్, షహనాజ్, సుజాత, ఎస్ఎంఐ రామన్, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు ఇచ్చి నట్టేట ముంచారు

- చెర్లోపల్లిలో రైతుల ఆందోళన
- 250 ఎకరాల్లో పంట నష్టం
- లబోదిబోమంటున్న కౌలు రైతులు


కంపెనీ ప్రతినిధులపై మండిపడుతున్న రైతులు


వెన్ను తీసిన పైరు, విత్తనాలతో ఆందోళన చేస్తున్న రైతులు

మనుబోలు, జనవరి 19: నకిలీ విత్తనాలు ఇచ్చి నట్టేట ముంచేశారంటూ మండలంలోని చెర్లోపల్లి రైతులు శుక్రవారం పొలాల వద్ద ఆందోళన చేశారు. 250 ఎకరాల్లో వరి పంట దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రైతులు తెలిపిన వివరాల మేరకు ... నెల్లూరులోని కావేరి సీడ్స్ నుంచి శ్రీ శివనందిని ట్రేడర్స్ పేరుతో ఉన్న బీపీటి విత్తనాలను చెర్లోపల్లికి చెందిన ఓ యువకుడు రైతులకు 50 బస్తాలకు పైగా, 30కేజీ బస్తా రూ .1400 చొప్పున విక్రయించాడు. బస్తాపైన బీపీటి ఉండడంతో నిజమేనని నమ్మి పదిమంది రైతులు కొనుగోలు చేసి పంటవేశారు. అయితే నాటిన 50రోజులకే వెన్నుతీయడంతో రైతులకు అనుమానం వచ్చింది. సాధారణంగా బీపీటి రకం 70రోజుల తరువాతే వెన్నుతీస్తుంది. ముందుగానే వెన్ను తీస్తే దిగుబడి ఉండదని, ఎకరాకు పుట్టి వడ్లు కూడా రావని రైతులు తెలిపారు. బీపీటి విత్తనాలు కాకుండా జిలకర్లు ఇచ్చి రైతులను మోసం చేశారు. ఇప్పటికే ఎకరానికి రూ.25వేలు ఖర్చు పెట్టామని, 250ఎకరాల్లో ఇదే రకం పంట వేసి దాదాపుగా రూ. కోటి నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. అనంతరం కావేరి సీడ్స్, శ్రీ శివనందిని ట్రేడర్స్‌కు చెందిన యజమానులు పొలాల వద్దకు రావడంతో నష్టపోయిన రైతులు వారితో వాగ్వాదానికి దిగారు. రైతులకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని, వ్యవసాయ మంత్రి, జిల్లా కలెక్టర్, వ్యవసాయశాఖ జేడి స్పందించి చెర్లోపల్లి రైతులకు పరిష్కారం చూపాలని వేడుకున్నారు.

ఎర్ర చందనం వాహనాలకు టెండర్లు

- అటవీ శాఖకు రూ.26.49 లక్షల ఆదాయం


టెండర్లను తెరుస్తున్న అటవీ శాఖ అధికారులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 19 : జిల్లావ్యాప్తంగా ఎర్రచందనం అక్రమ రవాణ చేస్తూ పట్టుబడ్డ వివిధ రకాల వాహనాలకు శుక్రవారం నెల్లూరులో టెండర్లతోపాటు వేలం పాట నిర్వహించారు. ఎర్ర చందనం ఎక్కువగా లభించే ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు రేంజ్‌లతోపాటు నెల్లూరు, కావలి పరిధిలో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడ్డ దాదాపు 46 వాహనాలకు టెండర్ల ప్రక్రియను పూర్తిచేశారు. కొన్ని వాహనాలకు అంచనా ధర రాకపోవడంతో టెండర్‌దారుల సమక్షంలో వేలం వేశారు. డీఎఫ్‌వో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. వాహనాల వేలం ద్వారా అటవీశాఖకు రూ.26.49 లక్షల ఆదాయం సమకూరనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రేంజర్లు మాల్యాద్రి, రవీంద్రబాబు, బాలకృష్ణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-ప్రొక్యూర్ టెండర్లతో వేదగిరికి రూ.51.74 లక్షల ఆదాయం


సీల్ టెండర్లను ఓపెన్ చేస్తున్న ఆలయ సిబ్బంది

నెల్లూరు రూరల్, జనవరి 19 : వేదగిరి క్షేత్రంలో పలు విభాగాలకు ఈ-ప్రొక్యూర్ విధానంలో నిర్వహించిన టెండర్ల ద్వారా ఆలయానికి రూ.51.74 లక్షల ఆదాయం సమకూరినట్లు పాలక మండలి చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈవో గిరికృష్ణ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సీల్డ్ టెండర్లను ఓపెన్ చేశారు. పార్కింగ్ టోల్‌గేట్, పూజా సామగ్రి విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణ, తలనీలాల సేకరణ, బుక్‌స్టాల్, కల్యాణ మండపం డెకరేషన్ హైరర్స్ ఆలయ ప్రాంగణంలోని 1,2,3 దుకాణాల కేటాయింపులతోపాటు పలు విభాగాలకు ఈ-ప్రొక్యూర్ ద్వారా టెండర్లు ఆహ్వానించినట్లు తెలిపారు. టెండర్ల ద్వారా ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు హక్కులు కేటాయిస్తున్నామన్నారు. గతేడాది కంటే ఈసారి రూ.4.95 లక్షలు అదనంగా ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, రూరల్ పోలీసులు పాల్గొన్నట్లు తెలిపారు.

నేటి నుంచి విజయవాడ మెమూ రైలు రద్దు

బిట్రగుంట, జనవరి 19 : బిట్రగుంట - విజయవాడ స్టేషన్ల మధ్య నడుస్తున్న మెమూ రైలు శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు రద్దు అయ్యింది. విజయవాడ నుంచి బిట్రగుంట వరకు మూడో లైన్ పనులు జరుగుతున్న దృష్ట్యా 07977, 07978 నెంబరు గల రైలును తాత్కాలికంగా రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా యువతి మృతి


యువతి మృతదేహం

నెల్లూరు(క్రైం), జనవరి 12: గుర్తుతెలియని యువతి అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన శుక్రవారం నెల్లూరులోని వేదాయపాళెం ప్రాంతంలో వెలుగు చూసింది. పోలీసుల సమాచారం మేరకు... సావిత్రినగర్ మూడో వీధిలో వెంకటేశ్వర టైల్స్ అండ్ శానిటరీ షాపు ముందు ఓ గుర్తు తెలియని యువతి మృతదేహం ఉన్నట్లు స్థానికుల సమాచా రంతో 27/3 సచివాలయం వీఆర్‌వో గొట్టేటి మురళీకృష్ణకు అక్కడికి చేరుకున్నారు. స్థానికులను ఆరా తీయగా కొద్ది రోజులుగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉదయం పూట కాగితాలు ఏరుకుంటూ రాత్రి పూట దుకాణాల ముందు నిద్ర పోతోందని తెలిపారు. దీంతో వీఆర్‌వో వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. అయితే యువతి చెవి నుంచి రక్తం వస్తుండటం, చిన్న వయసే కావడం చూస్తుంటే యువతిని ఎవరైనా హత్య చేశారా?, మరేవైనా కారణాలు ఉన్నాయా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	113
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5959
వెండి కిలో ధర	రూ. 73,200
వెండి ఒక గ్రాము	రూ. 75.20

వేతనాలు పెంచాల్సిందే !

- అంగన్‌వాడీల సమ్మె కొనసాగింపు


కలెక్టరేట్ వద్ద దీక్ష శిబిరంలో అంగన్‌వాడీలు

నెల్లూరు (వైద్యం), జనవరి 19 : జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సమ్మె కొనసాగుతోంది. ఐసీడీఎస్ కేంద్రాల వద్ద శుక్రవారం 39వ రోజు వారి నిరసనను కొనసాగించారు. నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద చేస్తున్న నిరాహార దీక్షలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచటంలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. ఇప్పటికే ప్రభుత్వంతో ఐదు దఫాలు చర్చలు జరిపినా ఫలితం లేదన్నారు. వారికి తప్పనిసరిగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వ రరావు, కొండాప్రసాద్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు రజిని, సంపూర్ణమ్మ, సుమతి, రత్నమ్మ, వెంకట కుమారి, మల్లమ్మ, రమాదేవి, కల్పన, ఉష పాల్గొన్నారు.

చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింధూజా

కావలి, జనవరి 19: కావలి నియోజకవర్గంలో ఈ నెల 26, 27 తేదీలలో జరగనున్న చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్రను విజయవంతం చేయాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబూరు సింధూజా పిలుపునిచ్చారు. కావలి టీడీపీ కార్యలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టు ముక్కల రఘురామరాజు సారథ్యంలో ఈ యాత్ర సాగుతోందన్నారు. 26న కాలనీలలో కార్మికులతో మాటా మంతీ, 27న కావలి పట్టణంలో కార్మికులతో చైతన్య సమావేశం ఉంటుందన్నారు. కార్మికుల ద్రోహి అయిన ఈ సైకో జగన్‌రెడ్డిని ఇకనైనా రోజువారి కూలీలు, ఆటో కార్మికులు అందరూ కలిసి రాష్ట్రం నుంచి తరిమికొట్టాలన్నారు. కార్మికుల రక్షకుడైన చంద్రబాబు నాయుడిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, షేక్ షరీఫ్, నూతలపాటి శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూరిపాక దగ్ధం

మనుబోలు, జనవరి 19: స్థానిక కోదండరామపురంలో ముమ్మారెడ్డి దేవసేనమ్మ పూరిపాక గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఆసమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గూడూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదం వలన రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు దేవసేనమ్మ తెలిపింది.

సీబీసీఐడీ అధికారినంటూ దోపిడీ

నెల్లూరు(క్రైం), జనవరి 19: సీబీసీఐడీ అధికారినంటూ ఓ వ్యక్తి నెల్లూరులోని ఓ కుటుంబాన్ని బెదిరించి బంగారం, నగదు దోచుకెళ్లాడు. పోలీసుల సమాచారం మేరకు.. ఏసీ నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ప్రసాద్, సుమలత దంపతులు నివసిస్తున్నారు. ప్రసాద్ యాడ్స్ డిజైనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన గతంలో బంధువు ఎస్ సుబ్బారావు ద్వారా కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో కొంతకాలం పనిచేశాడు. ఇదిలా ఉండగా ఈ నెల 17న మల్లికార్జున అనే వ్యక్తి ప్రసాద్ ఇంటికి వచ్చి సీబీసీఐడీ అధికారినని పరిచయం చేసుకున్నాడు. బళ్లారిలో ఉండగా ప్రసాద్ మనీలాండరింగ్‌కు పాల్పడ్డాడని, కేసు నమోదైంద ని చెప్పాడు. రూ.25 లక్షలు ఇస్తే కేసు నుంచి తప్పిస్తానని లేకుంటే పరువుతీస్తానని, జైలుకు పంపుతానని బెదిరించాడు. ప్రసాద్ కుటుంబసభ్యుల వద్దనున్న బంగారు ఉంగరం, రూ.25 వేల నగదును దోచుకెళ్లాడు. మల్లికార్జున, తమ బంధువు సుబ్బారావు పథకం ప్రకారమే దోపిడీకి పాల్పడ్డారని తెలుసుకున్న ప్రసాద్ కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంబేడ్కర్ స్మృతివనం రాష్ట్రపతి ప్రారంభించి ఉంటే బాగుండేది

- దళిత ద్రోహి జగన్ మరో అంబేడ్కరా?
- దళితసంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన


ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళిత నేతలు

కావలి, జనవరి 19: విజయవాడలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనంను రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభించి ఉంటే ఆయనకు తగిన గౌరవం ఇచ్చినట్లు ఉండేదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించడాన్ని నిరసిస్తూ కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ఈ మేరకు నిరసన తెలిపారు. అనంతరం మల్లి మాట్లాడుతూ విజయవాడలో ఏర్పాటు చేసిన స్మృతివనం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించటం, జగన్ మరో అంబేడ్కర్ అని మంత్రి మేరుగ నాగార్జున చెప్పడం దగా కోరుకుతనానికి నిదర్శనమన్నారు. వైసీపీ పాలనలో అనేక మంది దళిత గిరిజనులు హత్య గావించబడగా వాటిని సీఎం జగన్ ఖండించకపోగా నవ్వు కోవడం, హత్య చేసిన వారిని చేరదీసి ప్రశంసించడం దళిత, గిరిజనులను అవమాన పరచడమేనన్నారు. దళితుల మీదనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదన్నారు. ఈ పాలనలో ఒక్క సంక్షేమ హాస్టల్‌ను నిర్మించకపోగా ఉన్న వాటిని తీసివేసి దళిత, గిరిజన బిడ్డలను విద్యకు దూరం చేశారన్నారు. దళిత, గిరిజనులకు వ్యతిరేకంగా పనిచేసిన సీఎం జగన్ చేతుల మీదుగా అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభించటం రాజ్యాంగనిర్మాత అంబేడ్కర్‌కే అవమానకరమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు జరుగుమల్లి విజయరత్నం, నారుబోయిన లక్ష్మీనర్సు, గిరిజన నాయకులు చౌటు విజయరత్నం, కత్తి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆమంచర్ల ఆంజనేయ స్వామి గుడిలో చోరీ

నెల్లూరు రూరల్, జనవరి 19 : నెల్లూరు రూరల్లోని ఆమంచర్ల గ్రామంలోగల ఆంజనేయ స్వామి గుడిలో హుండీ చోరీ జరిగింది. హుండీని పగలుకొట్టి అందులోని నగదును అపహరిం చుకుపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఊరికి దూరంగా పొలాల్లో పగలుకొట్టిన హుండీని గుర్తించారు. ఇటీవల సంక్రాంతి సందర్భంగా ఈ ఆలయంలో వేడుకలు నిర్వహించిన నేపథ్యంలో హుండీలో రూ. 40 వేల నుంచి 50 వేల వరకు నగదు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. రూరల్ పోలీసులు ఆలయాలపై నిఘా ఉంచాలని ఆమంచర్ల వాసులు కోరుతున్నారు.

అంబేడ్కర్ పేరుతో ముఖ్యమంత్రి జగన్ మోసం

అంగన్వాడీల ఆగ్రహం


కావలిటౌన్ : అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


ఆత్మకూరు: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కావలిటౌన్, జనవరి 19: అంబేడ్కర్ ఆశయసాధనంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అబద్ధాలాడుతున్నారని అంగన్వాడీలు ధ్వజమెత్తారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరింది. ట్రంకురోడ్డులోని బ్రిడ్డి కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి అంగన్వాడీలు పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నిరసన తెలిపారు. యూనియన్ నేతలు రఘురావమ్మ, రమాదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయమని 5ఏళ్ల అడిగామని, పెడచెవిన పెట్టడం వల్లే రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. హామీలు అమలు చేయమని సమ్మె చేయడం నేరమైనట్లు ఎస్మా ప్రయోగించి బెదిరించడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు పసుపులేటి పెంచలయ్య, కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం వారు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో భైఠాయించి సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వ మొండి వైఖరిని అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివేదిస్తూ నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా సీఐటీయు నాయకులు శిబిరానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి సంతాపం


కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి రూరల్, జనవరి 19: మండలంలోని జీ.చెరువుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అనంతరాజు శ్రీనివాసరాజు శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఏఎంసీ చైర్మన్, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, టీడీపీ నాయకులు శ్రీనివాసరాజు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు రూ.10 వేలు, మన్నేటి వెంకటరెడ్డి రూ.15 వేలు మట్టి ఖర్చుల కింద కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ కప్పా శ్రీనివాసులు, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, మాబాషా తదితరులున్నారు.

బైపాస్ మీదుగా బస్సు సర్వీసులు

ఉదయగిరి రూరల్, జనవరి 19: ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి నెల్లూరు సెక్టార్‌లో తిరిగే పలు బస్సు సర్వీసులను సంగం ఊర్లోకి వెళ్లకుండా బైపాస్ మీదుగా నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి ఉదయగిరి నుంచి నెల్లూరు వెళ్లే బస్సులు, నెల్లూరు నుంచి ఉదయగిరికి వచ్చే బస్సులు సంగం బైపాస్ మీదుగా వస్తాయని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన అధికారులు


విజయవాడకు వెళ్తున్న అధికారులు, నాయకులు

వరికుంటపాడు, జనవరి 19: విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం నుంచి ప్రత్యేక బస్సును ఎంపీడీవో శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన బస్సులో రాజకీయ నాయకులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా విజయవాడకు తరలి వెళ్లడం అభినందనీయని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, దాసరి యర్రఓబయ్య, మాగంటి సిద్ధయ్య పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న బీపీఎం శ్రీలత

వరికుంటపాడు, జనవరి 19: తపాలా శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి బీపీఎం శ్రీలత అన్నారు. శుక్రవారం సర్పంచ్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఆమె కనియంపాడులోని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా బాలికల కోసం అమలులో ఉన్న సుకన్య సమృద్ధి యోజన పథకం పేద వర్గాలకు ఓ వరంగా ఉంటుందన్నారు. అలాగే అధికశాతం వడ్డీలు చెల్లించే పథకాలు సైతం అమలులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏబీపీఎం మనీషా తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలి


వరికుంటపాడు: సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి తిరుపాల్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 19: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో కులగణన సర్వే శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ వివరాలు సేకరించారు. సర్వే నిమిత్తం వచ్చేవారికి ప్రజలు సహకరించాలని కమిషనర్ బి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలోని 171 క్లస్టర్‌లలో కులగణన ప్రారంభమైనట్లు ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు.

ఉదయగిరి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కులగణన సర్వే ప్రారంభమైంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. కాగా, మండలంలోని నేలటూరు, గన్నేపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఈవోపీఆర్డీ మల్లికార్జున తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

వరికుంటపాడు: కులగణన సర్వే సమగ్రంగా చేపట్టి వేగవంతంగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి తిరుపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని వరికుంటపాడు, జడదేవి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. 28వ తేదీలోపు ప్రతి నివాసానికి వెళ్లి సేకరించిన నివేదికలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, ఈవోపీఆర్డీ సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు: వింజమూరు పట్టణంలోని 1, 2 సచివాలయాల్లో కులగణన సర్వేను సర్పంచ్ నల్లగొండ్ల సృజన శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వీఆర్‌వోలు శ్రీనివాసులరెడ్డి, నాగిరెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో సిబ్బంది అవస్థలు

సీతారామపురం: వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుండి కులగణన సర్వే ప్రారంభమైంది. కాగా, ప్రజల వివరాలను వారు సేకరిస్తుండగా సర్వర్ పనిచేయడం లేదని, ఒక్కో వ్యక్తి వద్ద వివరాల నమోదుకు అరగంటకు పైగా సమయం పడుతోందని వాలంటీర్లు వాపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా మండలంలోని చాలామంది వాలంటీర్లు కనీసం ఒక ఇంటిని కూడా సర్వే పూర్తిచేయలేకపోయారు. సర్వర్ పనిచేయకపోవడంతో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతోపాటు ప్రజలు సైతం అసహనానికి గురయ్యారు.

చేజర్ల: కులగణన సర్వేలో సర్వర్ మొరాయిస్తుండడంతో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు కేవలం రెండు మూడు మాత్రమే సర్వే అవుతుండడంతో తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

అందరి సంక్షేమం కేంద్ర ప్రభుత్వం లక్ష్యం

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, బీజేపీ నేతలు

ఆత్మకూరు, జనవరి 19 : ప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఉజ్వల గ్యాస్ సిలిండర్లు, ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి, స్పార్క్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు నజీర్‌బాష, పలు శాఖల అధికారులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ పేట దర్గా హుండీల లెక్కింపు


హుండీల లెక్కింపును పరిశీలిస్తున్న వక్ఫ్‌బోర్డు అధికారులు

ఏఎస్ పేట, జనవరి 19: స్థానిక హజరత్ సయ్యద్ ఖాజా రహమ తుల్లా నాయబ్ రసూల్ దర్గాను వక్ఫ్ బోర్డు అధికారులు స్వాధీనం చేసుకొని సుమారు 11 నెలల తరువాత శుక్రవారం ఉదయం వక్ఫ్ బోర్డు, రెవిన్యూ అధికారుల సమక్షంలో దర్గా ఈవో హసేన్ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు ప్రారంభించారు. దర్గాలో మొత్తం 17 హుండీలు ఉండగా సాయంత్రం వరకు సుమారు 12లక్షల 22వేల రూపాయలు వచ్చాయని దర్గా ఈవో హసేన్ తెలిపారు. రెండు, మూడు రోజుల పాటు హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. హుండీలు మొత్తం లెక్కించిన తరువాత పంచనామా నిర్వహించి నగదును దర్గా ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా సెకండ్ ఈవో షరీఫ్, స్టేట్ సూపరింటెండెంట్‌లు షేక్ ఇబ్రహీం, షేక్ గౌస్ మహిముద్దీన్, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్లు ఖుదావన్, అహ్మద్ బాషా, తహశీల్దారు లక్ష్మీనరసింహ, ఆర్ఐ రవితేజ పాల్గొన్నారు.

మారంరెడ్డిపల్లిలో జగనన్న సురక్ష

సీతారామపురం, జనవరి 19: మండలంలోని మారంరెడ్డిపల్లి సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సుధాకర్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి, డాక్టర్ స్వప్న, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట


ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకుంటున్న బొల్లినేని

వింజమూరు, జనవరి 19: టీడీపీ అధికారంలోకి వస్తే ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని గంగమిట్టలో బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బొల్లినేని మాట్లాడుతూ ముస్లింల ఆప్యాయత మరువలేనని, వారితో నాకున్న అనుబంధం ఎనలేనిదన్నారు. ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారిని మోసం చేశాడన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే టీడీపీ జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలు అమలు చేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్య క్షుడు గొంగటి రఘునాథరెడ్డి, మాజీ వీఎంసీ చైర్మన్ గంతులూరు వెంకటేశ్వరరావు, చల్లా వెంకటేశ్వర్లు, గురజాల వెంకటరమణయ్య, కొండ పల్లి వెంకటేశ్వర్లు, మహబూబ్ బాషా, ఎమ్మెస్ నాయుడు, చావా మహేష్, వేములపాటి మాల్యాద్రి, చల్లా శ్రీను, గణపవరం సుదర్శన్‌రెడ్డి, గూడా నర్సారెడ్డి, తిరుపతి ఆచారి పాల్గొన్నారు.

ఏడీఏ కార్యాలయం మార్పు

కందుకూరు: కందుకూరు సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న భవనం నుంచి ఇటీవలి వరకు అర్బన్ హెల్త్ సెంటర్ నిర్వహించిన భవనంలోకి మార్చినట్లు ఏడీఏ పి.అనసూయ ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని రైతులు ఈ మార్పును గమనించాలని కోరారు.

తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

● ఇంటూరి ● ఏలూరుపాడులో పలువురు టీడీపీలో చేరిక


గుడ్లూరు : ఏలూరుపాడులో టీడీపీలో చేరిన వారితో ఇంటూరి

గుడ్లూరు, జనవరి 19 : తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అని ఆపార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ఏలూరుపాడులో వైసీపీకి చెందిన 27 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వారిని నాగేశ్వరరావు సాదరంగా ఆహ్వానించి పసుపుకండువాలు వేశారు. పార్టీలో చేరిన పొనుగోటి బ్రహ్మయ్య, శివకుమార్, ధన్యాసి మురళి, స్వర్ణ బ్రహ్మయ్య, బొజ్జా ఏసురత్నం, పోనుగోటి చెన్నమ్మ, గంటా రమణయ్య, బోల్లేపల్లి శ్రీవాణి, చౌటూరి అగ్గియ్య, యద్దల మాలకొండయ్య, స్వర్ణ మాల్యాద్రి, యద్దల వెంకట రమణయ్య, బొజ్జా మస్తాన్, తదితరులు మాట్లాడారు. వైసీపీ సాగిస్తున్న అరాచక పాలనను చూస్తూ ఉండలేక అనేక మంది పార్టీని వీడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి చంద్రబాబుతోని సాధ్యమని గ్రహించి టీడీపీలో చేరుతున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జనిగర్ల నాగరాజు, నిమ్మకాయల రమణయ్య, గద్దగుంట శ్రీనివాసులు, పొట్లేళ్ల మురళి, పోలుగంగు కృష్ణ, ఎస్‌కే రఫి, ఎర్రంశెట్టి వెంకటేశ్వర్లు, ఆవుల శ్రీనివాసులు, పర్రే రామారావు, చిత్తారి మల్లికార్జున, గద్దగుంట మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

కందుకూరు : రానున్న ఎన్నికల్లో ప్రతి టీడీపీ కార్యకర్త అంకితభావంతో పని చేసి సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రచారం చేయాలని టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేసి టాస్కులు పూర్తి చేసిన 11 మందికి సైకిల్ నమూనా, 10 మంది కార్యకర్తలకు పార్టీ జెండా నమూనా జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందనేందుకు ప్రోత్సాహక బహుమతులు పొందినవారే ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ పట్టణ అధ్యక్షుడు వలేటి వెంకటేశ్వరరావు, నాయకులు ఉమ్మినేని సుబ్బారావు, మోతుకూరి పర్వతాలు, మచ్చా మనోహర్, పాలుబోయిన వెంకటశివకృష్ణ, నాదెండ్ల మధు, ముళ్లపాటి మహేష్, దివి హరిబాబు, భవనాసి వెంకటేశ్వర్లు, గోచిపాతల మోషే, తదితరులు పాల్గొన్నారు.

జగన్ జిమ్మిక్కులకు దళితులు మోసపోరు


మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

కావలి, జనవరి 19 : ఎన్నికల సమయంలో దళిత, గిరిజనులను ఆకట్టుకునేందుకు సీఎం జగన్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా దళిత, గిరిజనులు మోసపోరని టీడీపీ ఎస్సీసెల్ నేతలు పేర్కొన్నారు. కావలి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పెట్టడం మంచిదే అన్నారు. అయితే దళిత, గిరిజనుల 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి 125 అడుగుల కిందకు తొక్కడం న్యాయమా అని ప్రశ్నించారు. రూ.50 వేల కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించడం దారుణ మన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంతో మంది దళిత, గిరిజనులు హత్యగావించబడ్డారని, అక్రమ కేసులతో వేధించబడ్డారన్నారు. ఇంతగా దళిత, గిరిజనులను అణిచి వేసి అంబేడ్కర్ విగ్రహాన్ని అడ్డం పెట్టుకుని వారి ఓట్లను పొందడానికి జగన్ ప్రయత్నించడం దళిత,గిరిజనులను మోసగించటమేనన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికలలో వైసీపీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు జ్యోతి బాబూరావు, దావులూరి దేవకుమార్, అక్కిలిగుంట సూర్య ప్రకాష్, ఆత్మకూరు నాగరాజు, బాలఅంకయ్య, ఇనగంటి అనిల్ బాబు, మోడేగుంట శ్రీనివాసులు, పోట్లూరు శ్రీనివాసులు, సునీల్, వేణు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంతో దళితులకు చేసిన ద్రోహం చెరిగిపోదు

ఉలవపాడు : రాష్ట్రంలో దళితులపై దమనకాండ సాగించి దళితుల ఆరాధ్యుడు అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించి ఆర్భాటం చేసినంత మాత్రానా దళితులు వైసీపీ ప్రభుత్వాన్ని, జగన్ చేసిన ద్రోహాన్ని ఎన్నటికి మర్చిపోరని టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రావినూతల రమేష్, తెలుగు యువత మండల అధ్యక్షుడు, దళిత నాయకుడు తొట్టెంపూడి మాల్యాద్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వేల కోట్లు పక్కదారి పట్టించి దళితులను ఆర్థికంగా అనగదొక్కి, మానప్రాణాలను బలికొని తీరా ఎన్నికలు సమీపించే సరికి అంబేడ్కర్ విగ్రహం పేరుతో హడావుడి చేయడం దళితులను బుజ్జగించడమేనని పేర్కొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ


బాధితురాలిని విచారిస్తున్న డీఎస్పీ రామచంద్ర

ఉలవపాడు, జనవరి 19 : దళిత మహిళపై అగ్రకులానికి చెందిన తల్లీకొడుకు కులం పేరుతో దూషించి దాడి చేశారని అందిన ఫిర్యాదుపై శుక్రవారం కందుకూరు డీఎస్పీ రామచంద్ర విచారణ చేపట్టారు. గతనెల 26వ తేదీన ఉలవపాడు హైస్కూల్ సంఘంకు చెందిన మైపాటి భారతి, పాలకీర్తి ఉషలు తప్పిపోయిన గేదె కోసం వెతుకుంటూ అదే గ్రామానికి చెందిన పెద్దిసేని రాణెమ్మ పొలం వద్దకు వెళ్లారు. కట్టేసిన గేదెను చూసి అది తమదని చెప్పడంతో వారిమధ్య వాగ్వివాదం జరిగి చివరికి ఘర్షణకు దారితీసింది. అక్కడే ఉన్న రాణెమ్మ కుమారుడు వంశీకృష్ణ కర్రతో భారతి తలపై కొట్టడంతో గాయం అయింది. దీనిపై దాడి, కులదూషణపై కేసు నమోదు కావడంతో డీఎస్పీ, కందుకూరు సీఐ నఫీస్‌బాషా, ఎస్సై బాజీరెడ్డిలు బాధితురాలితోపాటు సాక్షులను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు.

చెడుగుడు పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ

బిట్రగుంట, జనవరి 19: బోగోలు పంచాయతీ కుమ్మరవీధిలో యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి పురుషులు, మహిళల చెడుగుడు పోటీలు గురువారం అర్ధరాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో అల్లూరుకు చెందిన మహిళా జట్టు విన్నర్స్‌గా నిలవగా రూ.5 వేల, రన్నరుగా నిలిచిన నెల్లూరు డీకేడబ్ల్యూ జట్టుకు రూ.4వేల బహుమతులను కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అందజేశారు. పురుషుల విభాగంలో విన్నర్‌గా నిలిచిన విడవలూరు జట్టుకు రూ.20 వేలు, రన్నరుగా నిలిచిన అల్లూరు జట్టుకు రూ.15 వేల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ అనిల్‌బాబు, నాయకులు వీరరఘు, శ్రీనివాసులు, నిర్వాహకులు బీప్రభాకర్, స్టాన్లీ, కిరణ్‌కుమార్, శ్యామ్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని యూటీఎఫ్ నిరసన



కావలిలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కావలిటౌన్, జనవరి 19: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం ట్రంకురోడ్డులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీ మాధవరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యురాలు శ్రీదేవి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వివిధ రూపాల్లో చెల్లించాల్సిన రూ.18వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటవ తేది జీతాలు చెల్లించాలని, పీఆర్సీ, డీఏ, పీఎఫ్ లోన్లు, ఏపీజీఐ తదితర పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. ఆర్డీవో కార్యాలయం నుంచి ఐదు లాంతర్ల సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా కార్యదర్శి పీ మాధవ, ముజీబ్ అహ్మద్, వేణుగోపాల్, తోట వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం శ్మశానంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఏర్పాట్లు

ఉలవపాడు, జనవరి 19 : మండలంలోని కరేడులోని ముస్లిం శ్మశాన వాటికలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అందులో భాగంగా అక్కడ చదును చేయించారు. దీనిపై ముస్లింలు మండల ముస్లిం మైనారిటీ కమిటీ అధ్యక్షుడితో కలసి శుక్రవారం ఎంపీడీవో ఎన్.విజయకు పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే కందుకూరు సబ్ కలెక్టర్, స్థానిక తహసీల్దారులకు వినతిపత్రాలు ఇచ్చామని, జిల్లా ముస్లి మైనారిటీ సంఘం నాయకులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

వినికిడి పరికరాల పంపిణీ


వినికిడి పరికరాలు పంపిణీ చేస్తున్న నళినీదేవి

వలేటివారిపాలెం, జనవరి 19 : వలేటివారిపాలెం పాత పంచాయతీ కార్యాలయంలో వినికిడి లోపం కలిగిన లబ్ధిదారులకు రామయ్య ఫౌండేషన్ ట్రస్ట్ అధ్యక్షురాలు ఉన్నం నళినీదేవి శుక్రవారం వినికిడి పరికరాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వినికిడి లోపం ఉన్న ఎంతో మంది పేదలు వినికిడి పరికరాలు కొనుగోలు చేయలేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారని, అలాంటి వారిని గుర్తించి పరికరాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినికిడి లోపం ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి మంచినీటి సరఫరా బంద్

కావలి, జనవరి 19: కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులోని ఐడీఎస్ఎంటీ దగ్గర సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నుంచి కావలికి మంచి నీరు సరఫరా అయ్యే ప్రధానపైపులైన్ మరమ్మతులకు గురైందని కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని మరమ్మతుల కోసం ఈ నెల 21, 22, 23 తేదీలలో మూడు రోజుల పాటు పట్టణంలో నీటి సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన అనంతరం నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. నీటి సరఫరాలో జరుగుతున్న అంతరాయానికి కావలి ప్రజలు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వలేటివారిపాలెం, జనవరి 19 : మండలంలోని పోలినేనిపాలెంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ఎండ్లూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు శుక్రవారం ఎండ్లూరి హనుమంతరావు, గాజులపర్తి మాల్యాద్రిలు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి కూనిపాలెం క్రికెట్ జట్టుకు, రెండవ బహుమతి పోలినేనిపాలెం జట్టుకు దక్కింది. ఈ పోటీలలో 30 టీమ్‌లు పాల్గొన్నాయి.

కులవృత్తులను గౌరవించండి

కలిగిరి, జనవరి 19: తమ కులవృత్తితో జీవనం సాగిస్తుంటే ఇతర సామాజిక వర్గానికి చెందిన వారు తమకు పోటీగా పట్టణంలో సెలూన్ షాపులు నిర్వహించడం సమంజసం కాదని పట్టణంలోని నాయిబ్రాహ్మణులు పేర్కొన్నారు. తాము కలిగిరి పట్టణంలో గత 30 ఏళ్లకు పైగా చిన్న చిన్న దుకాణాలు పెట్టుకొని కులవృత్తిని నమ్ముకొని స్థానికులకు క్షవరం చేస్తున్నామన్నారు. వేరే రాష్ట్రం నుంచి వచ్చిన, ఇతర సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు తమ దుకాణాలను అద్దెకిచ్చి వారితో హెయిర్‌కటింగ్ షాపులను పెట్టించడంపై నిరసన వ్యక్తం చేసి శుక్రవారం తమ దుకాణాలను మూసివేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కలిగిరి పట్టణ నాయిబ్రాహ్మణ సేవాసంఘ కమిటీ సభ్యులు, నాయిబ్రాహ్మణులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

వలేటివారిపాలెం, జనవరి 19 : విజయవాడలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన నేపథ్యంలో మండలంలోని పోకూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ శ్రేణులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విజయవాడకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్, వైసీపీ మండల అధ్యక్షుడు పరిటాల వీరాస్వామి, పోకూరు సర్పంచు పర్రె కనకరత్నం, జగదీష్, లింగాబత్తిన మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ'

అల్లూరు, జనవరి 19 : టీడీపీ అధిష్ఠానం ప్రవేశపెట్టిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మండలంలో శుక్రవారం కూడా కొనసాగింది. చంద్రబాబు ప్రవేశపెట్టి మినీ మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ క్రమంలో భాగంగా అల్లూరు గాంధీకాలనీలోని స్థానిక నాయకుడు నజీర్‌బాషా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు.

సాగునీటి కోసం రైతుల వాగ్వాదం

బిట్రగుంట, జనవరి 19: బోగోలు మండలం అల్లిమడుగులో వరి నాట్లు పూర్తికాక ముందే రైతుల్లో సాగునీటి కోసం గొడవలు మొదలయ్యాయి. కడనూతల చెరువు ఆయకట్టు కింద 120 ఎకరాలు అధికారకంగా 50 ఎకరాలు అనధికారకంగా సాగు చేస్తుంటారు. తెల్లగుంట రైతులకు సాగునీరు సక్రమంగా అందక నాటిన లేతపైరు ఎండిపోతుంది. కడనూతలకు చెందిన పేద దళితులకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములో నాటిన పంటకు సాగునీరు వేసుకోవడంతో దిగువ ప్రాంత రైతులకు నీరు అందటం లేదని శుక్రవారం రైతులు వాగ్వివాదానికి దిగారు. కడనూతల చెరువు నుంచి తక్కువ మోతాదులో సాగునీరు విడుదల చేయడం వలనే సమస్య వచ్చిందని చిన్నసన్నకారు రైతులు అంటున్నారు. పెద్దల చొరవతో ఇరుగ్రామాల రైతులు సద్దుమణిగారు కానీ ఎండుతున్న పంటకు సరిపడే సాగునీరు విడుదల విషయమైన సమస్య తీరలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టకపోతే పంట నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

నేడు గొలగమూడికి సోమిరెడ్డి రాక

వెంకటాచలం, జనవరి 19 : మండలంలోని గొలగమూడి గ్రామానికి శనివారం మధ్యాహ్నం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రానున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో జరిగే బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో సోమిరెడ్డి పాల్గొని ఇంటింటికీ తిరిగి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు.

చంద్రబాబు సభకు తరలిన జనం

రాపూరు(డక్కిలి), జనవరి 19 : వెంకటగిరిలో శుక్రవారం జరిగిన రా ...కదలిరా చంద్రబాబునాయుడి బహిరంగ సభకు రాపూరు మండలం నుంచి టీడీపీ కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు. స్థానిక నాయకులు నువ్వుల శివరామకృష్ణ, దందవోలు వెంకటేశ్వర్లు రెడ్డి, కొండ్లపూడి రాఘవరెడ్డి, ఏదోటి కోటేశ్వరనాయుడు, పచ్చిగళ్ల రత్నయ్య, రమణమ్మల ఆధ్వర్యంలో జనసమీకరణ జరిగింది.

పొదలకూరు: ఉమ్మడి జిల్లాలోని వెంకటగిరిలో శుక్రవారం రా.. కదలిరా చంద్రబాబునాయుడి బహిరంగ సభకు పొదలకూరు మండల నాయకులు భారీగా తరలివెళ్లారు. 60 వాహనాల్లో సుమారు 2వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. చంద్రబాబు సభను విజయవంతం చేసిన కార్యకర్తలకు మండల అధ్యక్షుడు తల చీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లి కార్జున్‌నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల్లో విజయానికి సమష్టిగా కృషిచేయాలి : నేదురుమల్లి

రాపూరు(డక్కిలి), జనవరి 19 : రాపూరు మండలం సంక్రాంతిపల్లిలోని పాపకన్ను మధురెడ్డి నివాసంలో శుక్రవారం వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఎన్నికల శంఖారావం సమావేశాలకు శ్రీకారం చుట్టారు. వచ్చే ఎన్నికల్లో అందరుతన విజయానికి సమిష్టిగా కృషిచేయాలని పార్టీ నేతలను కోరారు. అయితే ఈ సమావేశానికి చెన్నువర్గం హాజరుకాలేదు. సమావేశంలో వైసీపీ సీనియర్ నాయకులు పాపకన్ను మధుసూదనరెడ్డి, దయాకరరెడ్డి, నారాయణ రెడ్డి, నారసింహరెడ్డి, చెంచురామిరెడ్డి, నెల్లూరు రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత గంధం రమేష్ మృతదేహానికి పంచనామా

పొదలకూరు, జనవరి 19 : మండలంలోని మరుపూరు గ్రామానికి చెందిన టీడీపీ దళిత నేత, తెలుగునాడు ట్రేడ్ యూనియన్ నాయకుడు గంధం రమేష్ మృతదేహానికి శుక్రవారం పంచనామా నిర్వహించారు. ఈనెల 13న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రమేష్ మరణాన్ని అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో స్థానిక తహసీల్దారు వీరవసంతరావు, నెల్లూరు జీజీహెచ్ ఫోరెన్సిక్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎస్ఐ మస్తానయ్య మరుపూరు గ్రామంలోని హిందూ శ్మశాన వాటికలో పూడ్చిన మృతదేహాన్ని శుక్రవారం వెలికితీసి పంచనామా నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి 'చేనేత భేరి'

విడవలూరు, జనవరి 19 : చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చేనేత భేరి కార్యక్రమాన్ని తలపెట్టామని బీసీ నేత, చేనేత కార్మిక సంఘం నాయకుడు సోమ గోపాల్ తెలిపారు. మండలంలోని పార్లపల్లి, అలగానిపాడు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి చేనేత భేరికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో చేనేతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన నెల్లూరు నగరంలోని డీజేపీ కల్యాణ మండపంలో జరగబోవు చేనేత భేరి కార్యక్రమానికి చేనేత కుటుంబాలన్నీ హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు నందం అశ్వద్థామ, ఆశా, సురేష్, చప్పరం మల్లికార్జున, మార్కాపురం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కామాక్షితాయికి పల్లకి సేవ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 19: మండలంలోని జొన్నవాడ ఆలయంలో శుక్రవారం కామాక్షితాయి ఉత్సవమూర్తికి ఆలయం చుట్టూ పల్లకి సేవ వైభవంగా జరిగింది. ముందుగా ఆలయంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరిగింది. ఉదయం గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి ఆలయ పురోహితుడు జి.శ్రీధర్‌స్వామి నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా గొబ్బెమ్మల గ్రామోత్సవం

మనుబోలు, జనవరి 19: గొబ్బెమ్మల గ్రామోత్సవం శుక్రవారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. నెలరోజుల పాటు కాలనీల్లో కొలువుంచిన గొబ్బెమ్మలకు రోజూ పూజలు చేశారు. గురు వారం రాత్రి తూర్పు సంఘం, పడమర సంఘం, గిరి జన కాలనీల నుంచి గొబ్బెమ్మలను కండలేరు కాలువ వర కు ఊరేగింపు చేసి అనంతరం నిమజ్జనం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మనుబోలు, జనవరి 19: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి పోటీల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సచివాలయ, మండల స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులను ప్రత్యేకాధికారి చేతులమీదుగా అందజే శారు. విజేతలంతా త్వరలో నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో ఆడాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జీవీఎస్‌వి. ప్రసాద్, పీడీలు సరిత, మురళీమోహన్, ప్రమీలారాణి, కార్యదర్శులు రమణ, కృష్ణవేణి, అనిత, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పట్టాల పంపిణీ : మంత్రి కాకాణి

పొదలకూరు: జిల్లాలో పారదర్శకంగా అసైన్‌మెంట్ భూములకు పట్టాలు పం పిణీ చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అ న్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక్క సెంటు భూమి ఉన్న రైతుకు కూడా పూర్తి స్థాయిలో హక్కులు కల్పించి పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

పట్టువీడని అంగన్‌వాడీలు

- 39వ రోజు ఆందోళన కొనసాగింపు



మాట్లాడుతున్న విజయమ్మ

కోవూరు, జనవరి 19 : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె పట్టు వీడడం లేదు. సమ్మెలో భాగంగా కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన ఆందోళన స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట శుక్రవారం 39వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా నాయకురాలు విజయమ్మ మాట్లాడుతూ న్యాయమైన కోర్కెల సాధనకు పోరాడుతున్న తమను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రతిపక్ష నేతగా అధికారంలోకి వస్తే జీతం పెంచుతామని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాన్ని అధికారంలోకి వచ్చిన నాలుగన్నరాళ్లే తరువాత వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని చెప్పారు. తమ ఆందోళనను కించపరచే విధంగా అహంకారపూరితంగా ముఖ్యమంత్రి ఆదేశాలిస్తున్నారని ఆరోపించారు. సమస్యల్ని సానుభూతితో పరిశీలించి కనీస వేతనం చెల్లించాలని డిమాండు చేశారు. దీక్షా శిబిరాన్ని సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, మారుబోయిన సుబ్బారావు, అఫ్రోజ్ సందర్శించి మద్దతు ప్రకటించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సంఘం నాయకురాళ్లు వై సుజాత, వై సుభాషిణి, కవిత, ఎల్వీ శేషమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలపై సమీక్ష

ఇందుకూరుపేట, జనవరి 19 : ఇందుకూరుపేటలోని సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో శుక్రవారం ఇందుకూరుపేట, ముత్తుకూరు, టీపీగూడూరు మండలాల రైతు భరోసా కేంద్రాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి పాల్గొని మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ఈ క్రాపింగ్‌ను ఈనెల 31వ తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పీఎం కిసాన్ ఈకేవైసీ, ఈక్రాప్ చేసిన తర్వాత వీఆర్‌వోల అథెంటికేషన్, వీఏఏల అథెంటికేషన్, ఈ క్రాపింగ్, ఈకేవైసీ కూడా పూర్తి చేయాలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు విక్రయించిన తర్వాత డీబీటీలు, సీఎంఐడీ కియాస్కోలు ద్వారా తొందరగా పూర్తి చేస్తే తప్ప ఎరువులు రైతు భరోసా కేంద్రాలకు రావని తెలిపారు. అదేవిధంగా సీహెచ్‌సీల ద్వారా ఇచ్చిన వ్యవసాయ పనిముట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు నర్సోజీరావు, రాజ్‌కుమార్, వ్యవసాయ అధికారులు రఘునాథరెడ్డి, శిరీష రాణి, జోత్స్నారాణి, మంజుల, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

- యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన



కోవూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కోవూరు, జనవరి 19: ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వివిధ బకాయిలు తక్షణం చెల్లించాలని కోరుతూ యూటీ ఎఫ్ నాయకులు శుక్రవారం ఆందోళన చేశారు. మండల విద్యావనరుల కేంద్రం నుంచి బజారు కూడలి వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పీఎఫ్, ఏపీ జీఎల్, డీఏ, సరెండర్ లీవు బకాయిల్ను చెల్లించాలని నినాదాలు చేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా వలి, నాయకులు భాస్కరరావు, మాలకొండయ్య, భారతి, ఆర్ శీనయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బుచ్చి తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీవీ.శేషులు మాట్లాడుతూ రెండేళ్లుగా పేరుకుపోయిన డీఏలు, పీఆర్సీ, ఏపీజీఎల్ఐ, ఐఆర్ 30శాతం వెంటనే ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 24న జిల్లా కేంద్రంలో చేపట్టే నిరసన ర్యాలీకి ప్రభుత్వం స్పందించకుంటే జనవరి నెలాఖరులో రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రావణ్‌కుమార్, నాగిరెడ్డి, మూడు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కామాక్షితాయి ఆలయానికి రూ.2.21 లక్షల విరాళం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 19: మండలంలోని జొన్నవాడ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయానికి నెల్లూరుకు చెందిన దాతలు వేమిరెడ్డి కోటారెడ్డి, రమాదేవి దంపతులు శుక్రవారం ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వి.గిరికృష్ణలకు రూ.2.21 లక్షలు విరాళంగా అందజేశారు. ఆ నగదు ఆలయ అన్నదాన సదనం వెనుక ఉన్న డ్రైన్ మరమ్మతుల కోసం ఇచ్చినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా దాతలు గోత్రనామాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

వెంకటాచలం, జనవరి 19: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో అర్హత ఉండి మిగిలిపోయిన ప్రతి కుటుంబానికి గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ మందల వెంకటశేషయ్య, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ మోహన్‌నాయుడు, నాయకులు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బుచ్చిలో 'వికసిత్ భారత్'

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 19: బుచ్చిరెడ్డిపాళెం డీఎల్ఎన్ఆర్ హైస్కూలు ప్రాంగణంలో శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నగర కమిషనర్ ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకోసం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు గురించి సంచార రథంతో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, 16వార్డు కౌన్సిలర్ ప్రమీలమ్మ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యోగి వేమనకు ఘన నివాళి



వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన అధ్యయన కేంద్రం సంచాలకుడు మాడభూషి సంపత్‌కుమార్

వెంకటాచలం, జనవరి 19: మండలం లోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో శుక్రవారం కవి యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అధ్యయన కేంద్రం సంచాలకుడు మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ వేమన పద్యాలు సమాజానికి అవసరమన్నారు. కార్యక్రమంలో అధ్యయన కేంద్ర విద్యాత్మక, కార్యనిర్వాహక సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాలకు అండగా న్యాయస్థానం

- సీనియర్ సివిల్ జడ్జి వాణి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

తోటపల్లిగూడూరు, జనవరి 19 : వెనుకబడిన వర్గాలకు, మహిళలకు న్యాయసేవ అధికార సంస్థ ద్వారా సహాయం అందిస్తామని నెల్లూరు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి కె వాణి పేర్కొన్నారు. శుక్రవారం తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురం మందబైలు కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేద వర్గాలకు కోర్టు సంబంధమైన తగాదాల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. నిర్భయంగా వారి వారి సమస్యలను తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నిషేధం, ప్రాంసరీ నోట్ జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తోటపల్లిగూడూరు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ జంపానీ కుమార్, తహసీల్దారు లావణ్య, ఎంపీడీవో ప్రత్యూష, పారా లీగల్ వాలంటరీ వెంకయ్య, శైలజ, పసుపులేటి శేషయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.... ప్రయాణం ఎలా?

నెల్లూరు రూరల్: తవ్వేసిన రోడ్డు... బయటపడ్డ రాళ్లు... నరకప్రాయంగా ప్రయాణం. ఇదీ నెల్లూరు రూరల్లోని దొంతాలి గ్రామ రహదారి దుస్థితి. నగరానికి 13 కి.మీ. దూరానున్న ఆ ఊరికి పొదలకూరు రోడ్డు నుంచి 4 కి.మీ. పొడవున దారి ఉంది. కాంట్రాక్టర్ ఈ రోడ్డును పునర్నిర్మించే క్రమంలో పాత రహదారిని తవ్వేశారు. ఆ తర్వాత పనులు చేయకపోవడంతో గ్రామస్తులకు అవస్థలు మొదలయ్యాయి. గుంతలుగా ఉన్న రోడ్డును తవ్వడంతో రాళ్ళు బయటపడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇకనైనా రోడ్డును పూర్తిచేయాలని పల్లెప్రజలు కోరుతున్నారు.





చెత్త బస్టాండు

నిత్యం వేలాది మంది ప్రయాణాలు చేసే ఆర్టీసీ నెల్లూరు ప్రధాన బస్టాండులో చెత్త పేరుకుపోతోంది. బస్సులు లోపలికి వచ్చే మార్గంలో కార్గో కార్యాలయం పక్కన, స్కూటర్ స్టాండు వెనుక ప్రాంతం వ్యర్థాలతో నిండిపోతోంది. రోజుల తరబడి చెత్తను తొలగించకపోవడంతో రోడ్డంతా పరుచుకుంటోంది. అదంతా గాలికి బస్టాండు లోకి వస్తుండటంతో ప్రయా ణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ఆర్టీసీ రీజనల్ కార్యాలయం కూడా ఈ బస్టాండు ప్రాంగణంలోనే ఉంది. ఉన్నతాధికారులు ఇక్కడే ఉన్నప్పటికీ బస్టాండు పరిసరాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచకపోవడం గమనార్హం.

- నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

22న శ్రీరామ మహా శోభాయాత్ర



రాజీవ్‌గాంధీ నగర్‌లో నూతన విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం) జనవరి 19 : అయోధ్యలో ఈ నెల 22వ తేదీన బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆ రోజు సాయంత్రం 5 గంటలకు భక్తవత్సలనగర్‌లో మహా శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు శ్రీరామ సేవకులు శ్రీకంఠం మనోహర్, రాజేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శోభాయాత్ర బీవీనగర్ సాయిబాబా మందిరం నుంచి ప్రారంభమై మినీ బైపాస్‌రోడ్డులోని శ్రీరామ మందిరం వరకు సాగి, తిరిగి సాయిబాబా మందిరానికి చేరుతుంద ని తెలిపారు. అనంతరం సాయిబాబా మందిరంలో దీపోత్సవం జరుగుతుందని, భక్తులంద రూ శోభాయాత్రలో పాల్గొనాలని కోరారు.

శబరి శ్రీరామక్షేత్రంలో వేడుకలు

అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శబరి శ్రీరామక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఆలయ ప్రధాన అర్చకుడు నరేష్‌స్వామి ఆధ్వర్యంలో 22వ తేదీ ఉదయం 6 గంటలకు అభిషేకాలు, 9 గంటలకు రామనామ హోమాలు, 10 గంటల నుంచి రామనామ జపాలు జరుగుతాయని పేర్కొంది. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. సాయంత్రం రామాలయంలో భక్తులు దీపాలు వెలిగించి పెద్ద ఎత్తున బాణాసంచా కాలుస్తారని, అందరూ తరలిరావాలని కోరింది.

ప్రత్యేక పూజలు

ఈనెల 22న భక్తవత్సలనగర్‌లోని చార్భుజ గ్రానైట్ (పెట్రోలు బంకుపక్కన) దుకాణంలో ప్రత్యేక రామనామ పూజలు నిర్వహిస్తున్నట్లు భక్త బృందం ఓ ప్రకటనలో తెలిపింది. భక్తులు అందరూ తరలిరావాలని కోరింది.

సీతారామ విగ్రహాల తరలింపు

అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ ముహూర్తంలోనే కోవూరు మండలం సీతారామపురానికి నూతన సీతారామ లక్ష్మణ సహిత హనుమత్ విగ్రహాలను తరలించి ప్రతిష్ఠించనున్నట్లు ధర్మసింధు ఆధ్యాత్మిక సేవా సమితి సభ్యుడు ధ్వని శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ విగ్రహాలకు రాజీవ్‌గాంధీ నగర్‌లో అభిషేకాలు, పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

బిడ్డలందరికీ 'తల్లికి వందనం' : అజీజ్

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 19 : టీడీపీ అధికారం చేపట్టాక తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరి చదువుకు ఆర్థిక సాయం చేస్తామని ఆ పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజవకర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తెలిపారు. నగరంలోని 52వ డివిజన్ ఆనకట్టరోడ్డులో శుక్రవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెం టీ కార్యక్రమం నిర్వహించా రు. ఆయన మాట్లాడుతూ ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి అమ్మఒడి పథకం వర్తింపజేస్తామని జగన్ ప్రచారం చేసి అధికా రంలోకి రాగానే ఒకరికే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, ఇక్బాల్, యస్రబ్, రియాజ్, వెంకయ్య యాదవ్, చోటు, పాషా మొహిద్దీన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



చిరు వ్యాపారికి కరపత్రం అందిస్తున్న అబ్దుల్ అజీజ్

బీసీలకు ఏం చేశారో చెప్పండి ? : గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 19 : రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీ వర్గాలకు ఏం చేశారో చెప్పాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని సౌత్ మోపూరులో శుక్రవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీ వర్గాలను గుర్తించిన పార్టీ టీడీపీ మాత్రమేనన్నారు. వైసీపీ గడిచిన నాలుగేళ్లలో బీసీలకు కనీస గుర్తింపు కూడా ఇవ్వలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండూరు పాలిశెట్టి, పీఎల్‌రావు, ఉప్పు భాస్కర్, సుభాన్, జలదంకి సుధాకర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రాపూరు చంద్రశేఖర్, వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ చెంచమ్మ, ప్రదీప్ పాల్గొన్నారు. కాగా, బుజబుజనెల్లూరులో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత, కుమార్తెలు వైష్ణవి, హైందవి ప్రచారం చేశారు.

అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కారం

- నారాయణ కుమార్తె సింధూర

నెల్లూరు (వైద్యం), జనవరి 19 : ఈ సారి టీడీపీ అధికారంలోకి రాగానే సిటీలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి పైపులైను సమస్యలు పరిష్కరిస్తామని మాజీ మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర అన్నారు. శుక్రవారం నగరంలోని 44వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి నారాయణ హయాంలో చేసిన అభివృద్ధిని వివరించారు. నగరంలో గత 60 ఏళ్లలో జరగని అభివృద్ధిని మంత్రిగా ఉన్నప్పుడు నారాయణ చేసి చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 44వ డివిజన్ అధ్యక్షుడు ఏడుకొండలు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు దర్శి హరికృష్ణ, సత్య నారాయణరావు, రవిచంద్ర బాబు, రమేష్, విజయ, సురేంద్రబాబు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సోషల్ మీడియా అసత్య ప్రచారం : జనసేన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 12: వైసీపీ నాయకులు కపట బుద్ధితో పవన్‌కల్యాణ్‌పై సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేసి మిత్రపక్షాల మధ్య గొడవలు పెట్టాలని ప్రయత్నిస్తున్నారని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆరోపించారు. అంబేడ్కర్ భారీ విగ్రహం ఏర్పాటు చేసి దళిత వర్గాలను ఉద్ధరించినట్లు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతున్నారని, గత నాలుగేళ్లుగా వైసీపీ శ్రేణులు దళితులపై జరిపిన దాడులను రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని చెప్పారు. పవన్, సాజిత్, బలరాం, రోషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని సుబేదారుపేటలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో 150 మంది యువత జనసేనలో చేరారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ యువత పవన్‌కల్యాణ్ వెనుక నడుస్తుందని, రానున్న ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్‌గౌడ్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

బారాషహీద్ దర్గాలో ప్రత్యేక డ్రైవ్ : మేయర్

నెల్లూరు(సిటీ), జనవరి 19 : ఇటీవల సంభవించిన తుపాను తాకిడికి అపరిశుభ్రంగా మారిన బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పారిశుధ్య పనులు చేపట్టాలని కార్పొరేషన్ మేయర్ పోట్లూరి స్రవంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం దర్గా పరిసరాలను ఆమె పరిశీలించారు. స్వర్ణాల చెరువులో గుర్రపు డెక్కాకు పేరుకుపోయిందన్నారు. దీనిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని సూచించారు. దర్గా పరిసరాలు ఎల్లప్పుడు ఆహ్లాదకరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.



దర్గా పరిసరాలను పరిశీలిస్తున్న మేయర్ స్రవంతి

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

నెల్లూరు(సిటీ), జనవరి 19 : నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని టిడ్కో గృహ సముదాయానికి ప్రధాన పైపు లైన్ల అమరిక ఉన్నందున శనివారం 23, 24 డివిజన్ల పరిధిలోని పడారుపల్లి, సుందరయ్య కాలనీ, కనుపర్తిపాడు, హౌసింగ్‌బోర్డు కాలనీ, ఇందిరమ్మకాలనీ రిజర్వాయర్లకు తాగునీటి సరఫరా జరగదని, తద్వారా ఆ ప్రాంతాల్లో నీటి పంపిణీ ఉండదని తెలిపారు. ఈ ప్రాంతవాసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, ఆదివారం యథావిధిగా తాగునీటి సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు.

మాకు రాజ్యాధికారం కావాలి

- భారత రాజ్యాంగ పరిరక్షణ జేఏసీ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 19 : రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించిన పార్టీకే ముస్లింల మద్దతు ఉంటుందని, తమకు రాజ్యాధికారం కావాలని భారత రాజ్యాంగ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మౌలానా జనాబ్ ఇలియాస్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 14 శాతం ముస్లిం జనాభా ఉందని, రాజకీయ పార్టీలు తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన అన్ని ముస్లిం జమాత్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. పేరుకే మైనారిటీ కార్పొరేషన్ ఉందని, దానికి నిధులు.. విధులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్‌బోర్డు అవినీతిలో కూరుకుపోవడంతో వక్ఫ్ ఆస్తులన్నీ ఆక్రమణల్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కరీమ్, షకీల్, సయ్యద్ నవీన్ అహ్మద్ పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 19 : ది నెల్లూరు ఎలక్ట్రిసిటీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షకార్యదర్శులు శ్రీమరి, జయకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం కల్యాణ మండపంలో జరుగుతుందన్నారు. 73 ఏళ్లు పూర్తయిన పెన్షనర్లను సత్కరిస్తామని తెలిపారు. విద్యుత్ శాఖ విశ్రాంత ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

వరి పైరుకు జింకు లోపం : ఏడీఏ

నెల్లూరు రూరల్, జనవరి 19 : ప్రస్తుతం సాగులో ఉన్న వరి పైరులో జింకు లోపం కనిపిస్తోందని వ్యవసాయ శాఖ నెల్లూరు డివిజన్ ఏడీ ఎస్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండలంలోని ములుముడి, దేవరపాళెం గ్రామాల రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. జింకు లోపాన్ని అరికట్టకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు. ఇందుకు రైతులు 400 గ్రాముల జింకు సల్ఫేట్‌ను నీటిలో కలిపి వారం రోజుల్లో రెండు సార్లు పిచికారి చేయాలని సూచించారు. ఇలా చేయడం వల్ల జింకు లోపాన్ని అధిగమించవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎస్వీ నాగమోహన్ కూడా పాల్గొన్నారు.

వెంకటగిరిలో జనసునామీ

టీడీపీ బహిరంగసభకు పోటెత్తిన ప్రజానీకం

చంద్రబాబుపై శ్రేణుల్లో ఇనుమడించిన అభిమానం

సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయిన జిల్లా పార్టీ నేతలు

వెంకటగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో శుక్రవారం చంద్రబాబు పాల్గొన్న 'రా కదలిరా' బహిరంగసభకు జనం పోటెత్తారు. అధినేత పట్ల శ్రేణుల్లోనూ, ప్రజల్లోనూ అభిమానం, ఆదరణ మరింతగా ఇనుమడించిన వైనం సభలో కళ్ళకు కట్టింది. వెంకటగిరి సెగ్మెంట్ నుంచీ భారీఎత్తున శ్రేణులు తరలి రాగా శ్రీకాళహస్తి, గూడూరు నియోజకవర్గాల నుంచీ కూడా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు సభకు హాజరయ్యారు. ఇక తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని మిగిలిన సెగ్మెంట్ల నుంచీ కూడా ఇంచార్జులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ శ్రేణుల్ని సమీకరించడంతో వెంకటగిరి హెలిపాడ్ వద్ద, పట్టణ ప్రధాన రహదారులతో పాటు బహిరంగసభాస్థలి, పరిసర ప్రాంతాలు కూడా జనంతో నిండిపోయాయి. చంద్రబాబు మధ్యాహ్నం 11.47 గంటలకు హెలికాప్టర్‌లో వెంకటగిరి చేరుకున్నారు. అక్కడ నుంచీ 12.20 గంటలకు సభా వేదికపైకి చేరుకున్నారు. 12.52 గంటలకు ప్రసంగం ప్రారంభించిన ఆయన 1.42 దాకా మాట్లాడారు. ఎండ చురుగ్గా వుండడంతో పాటు ఆకలి వేస్తున్నా పార్టీ శ్రేణులు గానీ, ప్రజలు గానీ బహిరంగసభా ప్రాంగణం నుంచీ కదలలేదు. చంద్రబాబు వేదికపైకి వచ్చినపుడు జనం నుంచీ వచ్చిన స్పందన చూశాక ఆయన పట్ల శ్రేణుల్లో అభిమానం మరింత పెరిగినట్టు అనిపించింది. పలు అంశాలపై నేరుగా శ్రేణులనే ప్రశ్నించినపుడు కూడా కార్యకర్తలతో పాటు జనం ఉత్సాహంగా స్పందించి సమాధానాలిచ్చారు. చంద్రబాబు సభాస్థలి నుంచీ వెనుదిరిగాకే జనం వెలుపలికి వచ్చారు. వెంకటగిరి పట్టణ చరిత్రలో ఓ రాజకీయ సభకు ఈ స్థాయిలో జనం హాజరు కావడం విశేషమని స్థానికులు మాట్లాడుకోవడం వినిపించింది. అంచనాలకు మించి జనం హాజరు కావడంతో తిరుపతి జిల్లా టీడీపీ నేతలు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.





జిల్లా మారినా జనం రాత మారిందా?

వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైంది. రానున్న ఎన్నికల్లో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాలూ గెలుస్తున్నాం.

వెంకటగిరిలో బ్రహ్మాండమైన బహిరంగసభలో వేలాదిగా హాజరైన పార్టీ శ్రేణులను, ప్రజలనుద్దేశించి మాట్లాడిన చంద్రబాబు జిల్లా ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ, ప్రజలకు ప్రశ్నలు సంధిస్తూ, వారి నుంచి సమాధానాలు రాబడుతూ ఉత్సాహంగా, ఉద్వేగంగా ప్రసంగించారు. ఆయన ప్రసంగంలోని కొన్ని ముఖ్యాంశాలు ఇవీ...

అప్పుడు.. ఇవి చేశాను

"గతంలో నేను నెల్లూరు, తిరుపతి, చెన్నైలను అనుసంధానించి ఉమ్మడి నెల్లూరు జిల్లాను పారిశ్రామిక హబ్‌గా చేయాలనుకున్నాను. నెల్లూరు జిల్లా దగదర్తిలో విమానాశ్రయం, కృష్ణపట్నం పోర్టు ఏర్పాటు చేయడం ద్వారా జిల్లాను పారిశ్రామికంగా ఉన్నత స్థాయికి చేర్చాలని ప్రయత్నించాను. తిరుపతిలో ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేశాను. దానివల్ల అక్కడ టీసీఎల్, జోహో, సెల్‌కాన్, కార్బన్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కంపెనీలు అనేకం వచ్చాయి. తిరుపతి సహా తూర్పు ప్రాంతాన్ని ఆటోమొబైల్ హబ్ చేయడానికి చర్యలు తీసుకున్నా. ఫలితంగా అపోలో టైర్స్ వంటి ఆటోమొబైల్ సంబంధ పరిశ్రమలు చాలా ఏర్పాటయ్యాయి. ఏర్పేడు, వెంకటగిరి మధ్య ఐఐటీ, ఐసర్ వంటి అత్యున్నత జాతీయ విద్యా సంస్థలు ఏర్పాటు జరిగింది."

ఇప్పుడు ఇలా దోచేశారు

"ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టిన అనేక పనులు జగన్ ప్రభుత్వంలో ఆగిపోయాయి. ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి రూ. 399 కోట్లతో నేను పనులు మంజూరు చేస్తే కేవలం రూ. 19 కోట్లు ఖర్చు చేశాక పనులు ఆపేశారు. కండలేరు ప్రాజెక్టు పనులు ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో దానిపై ఆధారపడిన తెలుగుగంగ ప్రాజెక్టు కూడా పూర్తి కాకుండా ఆగిపోయింది. గూడూరులో రూ. 4500 కోట్ల విలువైన సిలికా ఇసుకను ఇష్టానుసారంగా అమ్మేస్తున్నారు. ప్రభుత్వం నుంచీ లైసెన్సు పొందిన అసలైన లీజు హోల్డర్లను తరిమేశారు. క్వార్జ్, బెరైటీస్, లేటరైట్, లైమ్ స్టోన్ వంటి మైన్లన్నీ అక్రమ మైనింగ్‌తో కొల్లగొట్టేశారు."





వైసీపీ నేతలపై బాబు పంచ్‌లు

ఈ ప్రాంత అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల కోసం గళం విప్పిన ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని సీఎం జగన్ దూరంగా పెట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో అధికార పార్టీ ఎమ్మెల్యేల దోపిడీపై ధ్వజమెత్తారు.

- సర్వేపల్లిలో మంత్రి కాకాణి కోర్టు దొంగ. గ్రావెల్ దోపిడీకి పాల్పడిన కాకాణికి ఇపుడు నెల్లూరు జిల్లాను కొనే శక్తి వచ్చేసింది.
- సత్యవేడు ఎమ్మెల్యే ఒట్టి రబ్బర్ స్టాంపు. అతడి నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి పెత్తనం సాగుతోంది.
- పెద్దిరెడ్డి మామూలు పుడింగి కాదు. రాష్ట్రంలోని మైన్లన్నింటినీ మింగేసి అరిగించుకోగల శక్తి ఆయనకు ఉంది.
- గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ మైన్లను ప్రసాదం తరహాలో మింగేశాడు. మామూళ్ళ వసూలు కోసం కొడుకును పెట్టాడు. ఆ రూ.4500 కోట్ల సిలికా దోపిడీలో ఎమ్మెల్యే వాటా ఎంతో చెప్పాలి.
- వెంకటగిరికి కొత్త బిచ్చగాడు వచ్చాడు. ఆయన పెన్నా నదిలో ఇసుక దోపిడీకి పాల్పడుతున్నాడు. 150 ఎకరాల్లో సిలికా దోపిడీ చేశాడు. నియోజకవర్గంలో విపరీతంగా భూ కబ్జాలకు పాల్పడుతున్నాడు. పార్టీ ఇంచార్జిగానే ఇలా బరితెగించే ఆయన ఒకవేళ ఎమ్మెల్యే అయితే ఇంకేం చేస్తాడో ఊహించుకోండి.
- సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇసుక, లిక్కర్, గంజాయి, క్రికెట్ బెట్టింగులు వంటి అక్రమ దందాలకు పాల్పడుతున్నారడు. సీఎం జగన్ విశాఖలో రిషికొండను బోడి చేసిన స్ఫూర్తితో శిరసనంబేడు కొండకు ఈయన గుండు కొట్టాడు.
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు రెడ్డి అవినీతి చూస్తుంటే కళ్లు తిరుగుతున్నాయి. అక్కడ రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగింది. రేణిగుంటను కూతురికి, ఏర్పేడును తమ్ముడికి రాసిచ్చేసి, శ్రీకాళహస్తిని తన సొంతానికి పెట్టుకున్నాడు.
- తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నాస్తికుడు. ఇపుడు దేవుడికే నామాలు పెడుతున్నాడు.

పైరవీల ధర్మారెడ్డి


తిరుమల ఈవో ధర్మారెడ్డిపై కూడా చంద్రబాబు పరోక్ష విమర్శలు చేశారు. శ్రీవారిని అడ్డం పెట్టుకుని పైరవీలతో కేసులు లేకుండా చేసే బాధ్యతను జగన్ ఆ అధికారికి అప్పగించారని ఆరోపించారు. సర్వీసులో ఒక్కసారైనా టీటీడీ ఈవో కావాలని కలలు కనే సీనియర్ ఐఏఎస్‌లకు కూడా ఇవ్వకుండా జగన్ తన కేసుల కోసమే ఆ అధికారిని ఈవోగా నియమించారన్నారు.

గూడూరు, వెంకటగిరికి వరాలు

అధికారంలోకి వచ్చాక గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తా. ప్రతి చేనేత కుటుంబానికీ ఇపుడు వైసీపీ ప్రభుత్వం ఇస్తున్న దానికంటే ఎక్కువ సాయం అందిస్తా. ఆక్వా రైతులకు యూనిట్ ఒకటిన్నర రూపాయి చొప్పున సబ్సిడీ విద్యుత్ అందిస్తా. డక్కిలి మండలంలో ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణాన్ని, అలాగే కండలేరు రిజర్వాయరు పెండింగ్ పనులను, తెలుగు గంగ ప్రాజెక్టు పెండింగు పనులను పూర్తి చేస్తాం. వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీకి అనుబంధంగా స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ ఏర్పాటు చేస్తా. స్వర్ణముఖి నదిపై చెక్‌డ్యాములు, వెంకటగిరి-నాయుడుపేట మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తా.

సభలో ప్రముఖులు : చంద్రబాబు సభలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, రాష్ట్ర మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, బీసీ నాయకుడు మస్తాన్ యాదవ్,వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, సునీల్ కుమార్, నెలవల సుబ్రమణ్యం, సుగుణమ్మ, కంభం విజయరామిరెడ్డి, టీడీపీ ఇంఛార్జులు గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, జనసేన నెల్లూరు, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు మధుక్రాంత రెడ్డి, పసుపులేటి హరిప్రసాద్, వెంకటగిరి జనసేన నాయకులు తోట కృష్ణయ్య, గూడూరు వెంకటేశ్వర్లు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, వూకా విజయకుమార్, వెంపటి మాధవుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిగుస్తున్న ఉచ్చు



- దొంగ ఓట్ల కేసులో మరో ఇద్దరిపై సస్పెన్షన్ వేటు
- బోగస్ ఓట్ల వెనుక గుర్తు తెలియని వ్యక్తులున్నారంటూ పోలీసులకు కార్పొరేషన్ కమిషనర్ ఫిర్యాదు
- ఫిర్యాదులో ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల పేర్లు
- అసలు సూత్రధారుల పేర్లు బయటకు రాకుండా ప్రయత్నాలు

తిరుపతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి దొంగ ఓట్ల కుంభకోణంలో డొంక కదులుతోంది. తొలి వేటు ఐఏఎస్ అధికారి గిరీషా మీద పడగా మలి వేటు ఒక తహసీల్దారు, మరొక డిప్యూటీ తహసీల్దారు మీద పడింది. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల విధుల్లో ఉన్న మిగిలిన అధికారుల మీద కూడా చర్యలు తప్పవనే ప్రచారం జరుగుతోంది.అయితే అసలు సూత్రధారుల పేర్లు బయటకు రాకుండా ఉండేందుకు అప్పుడే ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నట్టు చెబుతున్నారు. అందులో భాగంగానే ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల మీద పోలీసులకు ఫిర్యాదు చేశారని భావిస్తున్నారు. మరోవైపు వైసీపీ నేతల ఆదేశాలకు అనుగుణంగా విచ్చలవిడిగా ఉప ఎన్నికల విధులు నిర్వహించిన పోలీసు అధికారులు ఎన్నికల కమిషన్ కొరడా తమ మీదకు మళ్లకముందే సర్దుబాటు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉప ఎన్నికల్లో తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో వున్న మూడు అసెంబ్లీ నియోజకవర్గాలైన తిరుపతికి ఆర్వోగా మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఏఆర్వోగా అర్బన్ తహసీల్దార్ జయరాములు, శ్రీకాళహస్తి ఆర్వోగా గాలేరు-నగరి ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, సత్యవేడు ఆర్వోగా డ్వామా పీడీ చంద్రశేఖర్ వ్యవహరించారు. తిరుపతి కమిషనర్ గిరీషా ఈఆర్వోగా ఉన్నారు. ఆ సమయంలో ఈఆర్వో లాగిన్ నుంచి 34వేల ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ చేసి దొంగ ఓటరు కార్డులను సృష్టించినట్టు ఈసీ గుర్తించింది. దేశంలోనే అతిపెద్ద ఎన్నికల నేరంగా భావించి వెంటనే చర్యలకు ఉపక్రమించింది.ఈఆర్వోగా వ్యవహరించిన ప్రస్తుత అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాను సస్పెండ్ చేసింది. ఆ తర్వాతి వేటు ఉప ఎన్నికల సమయంలో ఏఆర్వోగా పనిచేసి ప్రస్తుతం కలెక్టరేట్‌లో ఏవోగా ఉన్న అర్బన్ తహసీల్దార్ జయరాములు మీదా, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి, ప్రస్తుతం పుత్తూరు డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న ఎం. విజయభాస్కర్‌లపై పడింది. ఈ ఇద్దరినీ ఈసీ సస్పెండ్ చేసింది. అప్పట్లో ఎన్నికల విధుల్లో ఉన్న మిగిలినవారి మీద కూడా చర్యలుంటాయనే ప్రచారం జరుగుతోంది. అప్పటి ఆర్డీవో కనకనరసా రెడ్డి పైన కూడా చర్యలు తప్పవనే ప్రచారం సాగుతోంది. అయితే ఉప ఎన్నిక ఓట్ల అవకతవకలతో తనకు సంబంధం లేదని ఆయన మీడియాకు వివరణ ఇచ్చుకున్నారు. అదేవిధంగా తిరుపతికి ఆర్వోగా పనిచేసిన కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డిపై కూడా త్వరలో వేటు పడనున్నట్టు అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది.

చిట్టెలుకలను ఇరికించే కుట్రా?

ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఒరిజనల్ ఎపిక్ (ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ)కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేసి, వాటి స్థానంలో నకిలీ ఎపిక్ కార్డులు రూపొందించారంటూ ఈనెల 7వ తేదీన తిరుపతి ఈస్టు పోలీసులకు కార్పొరేషన్ కమిషనర్ హరిత ఫిర్యాదు చేయడం చర్చగా మారింది.ఆ సమయంలో తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లు ప్రతాప నాయక్, సి.శివకుమార్, జి. విజయకుమార్‌లను ప్రాథమికంగా తాను విచారించానని, అయితే వారు తమ పాత్ర ఉన్నట్టు అంగీకరించలేదని హరిత ఫిర్యాదులో పేర్కొన్నారు.సాంకేతికపరమైన పరిజ్ఞానంతో లోతైన విచారణ చేపట్టాలని ఆమె కోరారు కూడా. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఐటీ చట్టం మేరకు విచారణకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే ఇదంతా కిందిస్థాయి ఉద్యోగులను బలిపశువులుగా చేసే కుట్రగా కనిపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.ముగ్గురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 34 వేల కార్డులను డౌన్‌లోడ్ చేసేంత సాహసం ఎందుకు చేసి ఉంటారనే ప్రశ్న బలంగా వినిపిస్తోంది. వీరికి పై అధికారుల నుంచి ఒక వేళ ఆదేశాలున్నా.. రాజకీయ నేతల ప్రమేయం లేకుండా జరిగే అవకాశమే లేదంటున్నారు. తిరుపతి కేంద్రంగా ప్రముఖ రాజకీయ నేతల కార్యాలయంలో ఈ దొంగ వ్యవహారం జరిగిందనే ప్రచారం నేపథ్యంలో.. దృష్టి మళ్లించడానికే ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల పేర్లతో హడావుడిగా ఫిర్యాదు చేశారంటున్నారు.



సస్పెండైన జయరాములు,విజయభాస్కర్

ప్లీజ్.. ప్లీజ్ .. సంతకం పెట్టండి: పోలీసుల వేడుకోలు

తిరుపతి ఉప ఎన్నికల్లో విధులు నిర్వహించిన పోలీసు అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది. జరిగిన అవకతవకలపై తనకేమీ సంబంధం లేదన్నట్టుగా సంతకం చేయమంటూ అప్పటి అలిపిరి సీఐ దేవేంద్రకుమార్ టీడీపీ ఎంపీ అభ్యర్థి పనబాక లక్ష్మిని గురువారం కోరినట్టు చెబుతున్నారు.మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసంలో మీడియా సమావేశంలో పనబాక లక్ష్మి ఉండగా సీఐ అక్కడకు చేరుకుని అభ్యర్థించారని చెబుతున్నారు. ఉప ఎన్నికల వేళ దొంగ ఓట్లు వేసినవారిపై ఆధారాలతో సహా పనబాక లక్ష్మి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆమె ఫిర్యాదులో పేర్కొన్నవారు తమ విచారణలో అసలైన ఓటర్లని తేలిందని అంగీకరిస్తున్నట్టు సంతకం పెట్టాలని సీఐ కోరారని తెలుస్తోంది.దీనిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఆమె, సంతకం పెట్టకుండా తిప్పి పంపారంటున్నారు. మరి కొందరు పోలీసు అధికారులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి వద్దకు పరుగులు తీసినట్టు చెబుతున్నారు. ఎలాగైనా తమను కాపాడాలంటూ వేడుకున్నారని,ఆయన మాత్రం,కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల విషయంలో తానేమీ జోక్యం చేసుకోలేనని తేల్చి చెప్పేశారని తెలుస్తోంది. దీంతో నాయకుల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించిన పోలీసులు తల్లడిల్లుతున్నట్టు చెబుతున్నారు.



బాధితురాలు దేవసేనమ్మ, దుండగులు కలిపిన పౌడర్ నీళ్లు

మెరుగు పేరుతో మాయ

● వృద్ధ దంపతులను మభ్యపెట్టి

ఆరు సవర్ల బంగారం అపహరణ

పెళ్లకూరు, జనవరి 19: వృద్ధ దంపతులను మభ్యపెట్టి ఆరు సవర్ల బంగారు సరుడు అపహరించిన ఘటన పెళ్లకూరు మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. చిల్లకూరులో వుంటోన్న వృద్ధ దంపతులు చాగణం శంకరయ్య, దేవసేనమ్మ ఇంటికి శుక్రవారం ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వెండి, రాగి వస్తువులకు మెరుగు పెడతామనడంతో శంకరయ్య రాగిపాత్ర ఒకటి ఇచ్చారు. వారి దగ్గర వున్న రెండు రకాల పౌడర్‌తో ఆ పాత్రను శుద్ధి చేయడంతో తళతళ మెరిసింది. దీంతో ఓ మంగళసూత్రం, కాసులు పొదిగిన ఆరు సవర్ల బంగారు సరుడును వారికి ఇచ్చారు. ఓ పాత్రలో కలిపిన పౌడర్ నీళ్లలో వాటిన వేసిన ఆ వ్యక్తులు ఇంకొంత సేపుంటే మెరుగు బాగా వస్తుందని చెప్పారు.దేవసేనమ్మ ఇంట్లోకి వెళ్లిన సమయంలో శంకరయ్య కన్నుగప్పి పాత్రలో ఉన్న బంగారు సరుడు తీసుకున పారిపోయారు.మోసపోయామని గ్రహించిన దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం



హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

వెంకటగిరి టౌన్, జనవరి 19: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా చంద్రబాబు నాయుడికి ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 11.49 నిమిషాలకు వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళశాల మైదానంలోని హెలిప్యాడ్‌కు చేరుకున్న చంద్రబాబుకు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆయన సతీమణి సింధు, కుమార్తె లక్ష్మి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి, టీడీపీ నాయకులు బొలిగల మస్తాన్ యాదవ్, తానంకి నానాజీ, నవజీవన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కాలువపల్లి సహదేవయ్య, జెన్ని రమణయ్య, పట్టాభిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు, పులికల్లు రాజేశ్వరరావు, శ్రీరామదాసు గంగాధర్, పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, మేడికొండ పద్మ మోహన్ నాయుడు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. తిరుగు ప్రయాణంలో వెంకటగిరి పట్టణానికి చెందిన పోలిశెట్టి శంకర్‌బాబు పెన్సిల్‌తో గీసిన చంద్రబాబు చిత్రాన్ని ఆయనకు బహూకరించారు.

డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో ఆదినారాయణ

గూడూరు, జనవరి 19: డ్రైవర్లు ప్రతిమూడు నెలలకు ఒక్కసారి తప్పనిసరిగా బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆర్టీవో ఆదినారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక ఆదిశంకర ఇంజనరింగ్ కళాశాలలో రవాణ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లుకు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు నిబంధనలు పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫారం-7 అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరపండి

జిల్లా అధికారులకు ఎన్నికల సంఘం ఆదేశం



వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 19: ఫారం-7 ద్వారా అందిన అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరిపి తప్పుల్లేని ఓటర్ల తుది జాబితా తయారీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. విజయవాడ నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి జేసీ శుభం బన్సల్ ఈఆర్వోలతో కలిసి హాజరయ్యారు. ఎన్నికల అధికారి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు అందుబాటులో ఉండాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది నియామకం కోసం ఉద్యోగుల డేటాబేస్ తయారీ పూర్తి కావాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, అనుబంధ అధికారులకు శిక్షణ కోసం సమావేశ మందిరాలను ఎంపిక చేయాలన్నారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని చర్యలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఈఆర్వోలు హరిత, కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు, నిషాంత్‌రెడ్డి, చంద్రముని, ఎన్నికల తహసీల్దారు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



చంద్రబాబుతో పాశిం సునీల్‌కుమార్



చంద్రబాబుతో మాట్లాడుతున్న సోమిరెడ్డి



కురుగొండ్లకు సూచనలిస్తున్న చంద్రబాబు

టీడీపీలో చేరిన రత్నయ్య



రత్నయ్యకు టీడీపీ కండువా కప్పుతున్న చంద్రబాబు

దొరవారిసత్రం, జనవరి 19: దొరవారిసత్రం మండల మాజీ జడ్పీటీసీ ఇట్టగుంట రత్నయ్య టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. శుక్రవారం వెంకటగిరిలో జరిగిన రా.. కదిలి రా.. సభలో నెలవల సుబ్రహ్మణ్యంతో ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు సమక్ష్యంలో టీడీపీలో చేరారు. గతంలో టీడీపీలో ఉన్న ఆయన 2019 ఎన్నికల అనంతరం వైసీపీలోకి వెళ్లారు. ప్రస్తుతం తిరిగి స్వంత గూటికి చేరారు.



సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు - పార్టీ శ్రేణుల ఉత్సాహం

జన ప్రభంజనం

వెంకటగిరి/గూడూరు/డక్కిలి, జనవరి 19: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వెంకటగిరిలో శుక్రవారం నిర్వహించిన రా... కదలిరా... బహిరంగ సభ జనప్రభంజనంగా మారింది. టీడీపీ శ్రేణులతో పాటు అభిమానులు, మహిళలు, వృద్ధులు వేలాదిగా తరలివచ్చారు. పట్టణమంతా పార్టీ జండాల రెపరెపలతో పసుపురంగు అలుముకొంది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బొలిగల మస్తాన్‌యాదవ్ ఏర్పాటు చేసిన చంద్రబాబు, నారా లోకేశ్‌ల బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో ఖనిజసంపద ఉన్న నెల్లూరు జిల్లాను అడ్డదిడ్డంగా విభజించి వైసీపీ నాయకులు ఆస్తులు పెంచుకునేందుకు వనరుల దోపిడీకి తెరతీశారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. తెల్ల బంగారంగా చెప్పుకునే క్వార్ట్జ్, సిలికాను దోపిడీ చేసి వేల కోట్లు కొల్లగొట్టారని, ఒక్క సిలికా ద్వారానే రూ.4,500 కోట్లు దోచుకుంటున్నారన్నారు. క్వార్ట్జ్ అక్రమ రవాణాపై తాను దీక్ష చేసినా పట్టించుకున్న నాథుడేలేరన్నారు. క్వార్ట్జ్ టన్నుకు రూ.7 వేల లెక్కన జగన్‌ట్యాక్స్ వసూలు చేశారని ఆరోపించారు. రైతు మంత్రిగా చెప్పుకునే ఆయన అన్నదాతల మెడకు ఉరితాళ్లు తగిలించేలా వ్యవహరిస్తున్నారని మంత్రి కాకాణిపై విమర్శలు గుప్పించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అవినీతి సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలకే మాఫియా పెరిగిపోయిందని, ఈ విషయాన్ని ప్రశ్నించినందుకు సీఎం జగన్ తనపై కక్ష కట్టారన్నారు. వెంకటగిరి అభివృద్ధికి అనేక అంశాలను సీఎంకు విన్నవించినా వాటిని నెరవేర్చకుండా బుట్టదాఖలు చేశారని చెప్పారు. రా.. కదిలిరా.. కార్యక్రమం వైసీపీని తుదముట్టిస్తుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనకు 82 రోజుల్లో ఆయుస్సు ముగియనుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు అనే ఆయుధంతో జగన్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మాజీ ఎంపీ పనబాక లక్ష్మి మాట్లాడుతూ ఒక్కచాన్స్‌తో రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసి అన్ని వర్గాల ప్రజలను వీధులపాలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. యువత, ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు ఇలా అందరి కడుపు కొట్టారని దుయ్యబట్టారు. వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి అంతా టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. వెంకటగిరిలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కాలేజీ, అసంపూర్తిగా వున్న బెల్ కర్మాగారాన్ని పూర్తి చేయడంతో పాటు వెంకటగిరి - కోడూరు రోడ్డు, డక్కిలి మడంలం ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం పనులు అధికారంలోకి రాగానే పూర్తిచేయాలని కోరారు. గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని, అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేలా చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటారన్నారు. అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అక్రమ సిలికా రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ తిరుమలో వెంకటేశ్వరస్వామి, శ్రీకాళహస్తి ముక్కంటి ఆలయాల్లో జరుగుతున్న అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి దోషులను శిక్షించాలన్నారు. శ్రీకాళహస్తి ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం జగన్ ప్రజలను నిలువు దోపిడీ చేశారని విమర్శించారు. శ్రీకాళహస్తిలో స్థానిక ఎమ్మెల్యే అవినీతికి అడ్డులేకుండా పోతుందోని ఆగ్రహం వ్యక్తం చేశారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆనం, కురుగొండ్ల సతీమణి సింధు, తానంకి నానాజీ, సన్మానిస్తున్న పనబాక లక్ష్మి



చంద్రబాబుతో మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి, ప్లకార్డులతో మహిళల ఆనందోత్సాహం - పసుపుమయంగా వెంకటగిరి రోడ్డు



గూడూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన - నాయుడుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

అంగన్వాడీలను విస్మరిస్తే అధోగతే

సూళ్లూరుపేట, జనవరి 19: అంగన్వాడీలను విస్మరిస్తే ప్రభుత్వానికి అధోగతి పడుతుందని సీఐటీయూ నాయకుడు పద్మనాభయ్య అన్నారు. స్థానిక హోలిక్రాస్ కూడలి వద్ద శిబిరంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారంతో 39వ రోజుకు చేరింది. వారికి యుటీఎఫ్ నాయకులు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను అంగీకరించే వరకు ఉద్యమం ఆగదన్నారు. షోకాజ్ నోటీసులు అందజేసి బెదిరిస్తే భయపడేది లేదని యూనియన్ నాయకురాలు హైమావతి అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రమణయ్య, మనోహర్, అల్లెయ్య, యుటీఎఫ్ నాయకులు ప్రభాకర్, నాగరాజు పాల్గొన్నారు.

గూడూరు: అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 39వ రోజు కొనసాగింది. దీక్షా శిబిరం నుంచి అంగన్వాడీలు, సీఐటీయూ నాయకులు ప్రదర్శనగా టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకుని అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య, ఇంద్రావతి, ప్రభావతి, మునికుమారి, లక్ష్మి, పెంచలమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి అంగన్వాడీలు తమ గోడును విన్నవించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివకవి ముకుంద, అంగన్వాడీ ప్రాజెక్టు సంఘ నాయకురాలు శ్యామలమ్మ మాట్లాడుతూ సీఎం జగన్ విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారని, ఆయన ఆశయాలను మాత్రం తంగలో తొక్కుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సంధ్య, కళావతి, రూప, నాగమ్మ, వాణి తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీలు నిరసన తెలిపారు. ప్రాజెక్టు కార్యాలయం నుంచి నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా గోపాల్ రెడ్డి విగ్రహం మీదుగా బజారుసెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని అమలు చేసేలా ప్రభుత్వానికి మంచి మనస్సు ప్రసాదించాలంటూ ప్రార్థించారు. అక్కడే మానవహారం ఏర్పాటు చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ఓజిలి, జనవరి 19: ఓజిలి మండలం ఇనుగుంటలో శుక్రవారం పంచాయతీ సర్పంచు కొణిదల విజయమ్మ ఆధ్వర్యంలో వికసిత్‌భారత్ సంకల్పయాత్ర సభ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ఈవోపీఆర్డీ మోహన్ వివరించారు. లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ పాలూరు వేణురెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని వెంకన్నపాళెంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, సారంగం రమేష్‌బాబు, ఎంపీడీవో భవానీ కేంద్ర ప్రభుత్వ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

అంబేడ్కర్‌కు నివాళి

గూడూరు, జనవరి 19: సమసమాజ స్థాపన కోసం రాజ్యాంగం ద్వారా హక్కులను కల్పించి మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు అన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు వెళుతున్న వాహనాలను శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లో జెండాఊపి ప్రారంభించారు. పొణకా దేవసేనమ్మ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, బొమిడి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కులగణన సర్వే

కోట, జనవరి 19: మండల పరిధిలోని ఊనుగుంట పాళెం, రుద్రవరం గ్రామాల్లో శుక్రవారం సర్వే ప్రారంభమైంది. సూపర్ వైజర్ రత్నయ్య ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు ఇంటింటా తిరిగి కులాలవారీగా కుటుంబసభ్యుల వివరాలను యాప్‌లో నమోదు చేశారు.

జమినీ కొత్తపాళెంలో ఆరోగ్య సురక్ష శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ కమల

వాకాడు, జనవరి 19: మండలంలోని జమినీ కొత్త పాళెంలో శుక్రవారం ఎంపీడీవో గోపీనాథ్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి సలహాలు అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు కిరణ్ కుమార్‌రెడ్డి, వైద్యులు కమలశ్రీ, ప్రవీణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గూడలిలో...

కోట, జనవరి 19: మండల పరిధిలోని గూడలి సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంజమ్మ, జడ్పీటీసీ కోటయ్య, ఎంపీడీవో భవానీ, సర్పంచు ఆదెమ్మ, ఉప సర్పంచు పల్లెమల్లు విజయ సారథిరెడ్డి, కార్యదర్శి కిరణ్‌కుమార్, నాయకులు నాగూర్‌యాదవ్, షనిల్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గొబ్బెమ్మ గ్రామోత్సవం



కోట, జనవరి 19: మండల పరిధిలోని గూడలిలో శుక్రవారం గొబ్బెమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక అరుంధతీయవాడ మహిళలు గొబ్బెమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి స్థానిక స్వర్ణముఖినదిలో నిమజ్జనం చేశారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించండి



వెంకటగిరిలో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

వెంకటగిరి టౌన్, జనవరి 19: ఉపాధ్యాయులకు అందాల్సిన బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వరి, ఆదినారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తాలూక కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ విధి విధానాలు నిర్ణయించకుండా ప్రభుత్వం మీనమేశాలు లెక్కిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నివేదిక వచ్చేవరకు 30శాతం ఇంటీరియమ్ రిలీఫ్ చెల్లించాలని కోరారు. అలాగే సరెండర్ లీవుల ఎన్ క్యాష్ మెంట్ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెన్షనర్ల ఫైనల్ పేమెంట్లు చెల్లించాలన్నారు. అదేవిధంగా పీఎఫ్ సైట్‌ను వెంటనే పునరుద్ధరించి చందాలు, వడ్డీలు, సకాలంలో చెల్లించి, పీఆర్సీడీఏ అరియర్స్‌ను జమ చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఉదయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, గంగారావు, వెంకటేశ్వర్లు, రత్నశేఖర్, వెంకటేశు, శాణిశ్రీ, కరుణ, విజయ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించి బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సుధీర్, నాగేశ్వరరావు, రవి, మురళీసింగ్, వరప్రసాద్, గురునాధం, జనార్దన్, భగవాన్, బాలసుబ్రహ్మణ్యం, మనోజ్, శివాజీ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీదేవి

నాయుడుపేట టౌన్, జనవరి 19: వరిసాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడి పొందవచ్చని జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ లక్ష్మీదేవి అన్నారు. నాయుడుపేట మండలం ద్వారకాపురంలో శుక్రవారం రైతులకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. వరి విత్తనాలు ఎంపిక, ఎరువుల యాజమాన్యం, వరిలో వచ్చు కలుపుమొక్కల నివారణ వాటిపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరి పంటలో ఉన్నటువంటి ఆకు చుట్టుపురుగు, కాండంపురుగు, పాముపొడ తెగులు, అగ్గితెగులు నివారణ గురించి తెలియజేశారు. కాండం తులుపు పురుగు నివారణకు హైడ్రోక్లోరైడ్ 350 గ్రాముల నుంచి 400గ్రాములు వాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర ఏవో శ్రీనివాసులు, ఏవో గణేష్, వీఏఏ అహ్మద్, రైతులు పాల్గొన్నారు.

వరికి యూరియా ఎక్కువైతే అనర్థం

బాలాయపల్లి,జనవరి 19: వరికి అవసరానికి మించి యూరియా వాడకం వల్ల చీడపీడలు సోకి నష్టం వాటిల్లుతుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని వెంగమాంబపురం రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేణుగోపాలరావు, శిరీషా, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెక్కోడియా పోస్టర్ల ఆవిష్కరణ

కోట, జనవరి 19: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెక్కోడియా 2024 సదస్సుకు సంబంధించిన పోస్టర్లను డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు ఆవిష్కరించారు. ఫిబ్రవరి 24వ తేదీన కళాశాలలో మెక్కోడియా సదస్సు జరుగనుంది. తెలంగాణ, ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు సదస్సులో పాల్గొని పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్ ఇస్తారు.